హైదరాబాద్
శుక్రవారం-13
నవంబర్-2026

పేజీలు-8

balagamtv100@gmail.com

బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/

ముప్పు ఏ రూపంలో వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి



● రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివరాలు 3లో..

విద్యార్థుల్లో జాతీయ భావాలు పెంపొందించాలి

- భగత్‌సింగ్ స్ఫూర్తితో దేశం కోసం పనిచేయాలి..
- యువత సామాజిక మార్పులో భాగస్వాములు కావాలి
- ప్రధాని మోదీ నాయకత్వాన్ని ప్రతిపక్షాలు ఎదుర్కోలేవు:
- ఎంపీ ఈటల రాజేందర్

వివరాలు 2లో..



జీసీసీలతో తెలంగాణ ఆర్థిక ప్రగతికి ఊతం

- హైదరాబాద్‌లో మార్స్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ ప్రారంభం..
- ప్రస్తుతం 400 మందికి ఉపాధి
- భవిష్యత్తులో ఉద్యోగుల సంఖ్య వెయ్యికి పెరిగే అవకాశం: ● మంత్రి శ్రీధర్‌బాబు

వివరాలు 2లో..



భారత్ సమ్మిట్‌కు ఖర్గే, డీకే శివకుమార్‌కు భట్టి విక్రమార్క ఆహ్వానం

- బెంగళూరులో ఏఐసీసీ అధ్యక్షుడు, కర్ణాటక ముఖ్యమంత్రితో ఉప ముఖ్యమంత్రి భేటీ

వివరాలు 3లో..



పెట్టుబడులే లక్ష్యం.. అభివృద్ధే అజెండా



- 25 రంగాలు.. ప్రత్యేక పారిశ్రామిక పార్కులు
- ఈ సదస్సులో 303 ఒప్పందాలు..
- రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు
- సీఐఐ భాగస్వామ్య సదస్సులో సీఎం చంద్రబాబు సమగ్ర ప్రజెంటేషన్

వివరాలు 4లో..

జూన్ 2 నాటికి టిమ్స్‌లు పూర్తి స్థాయి సేవలందించాలి

- ఏడాదిలో ఉస్మానియా సేవలు ప్రజలకు అందాలి
- మూడు టిమ్స్‌లకు ఏకీకృత నియామకాలులి నిమ్స్...
- టిమ్స్‌ల మధ్య సమన్వయం ఉండాలి
- వైద్యులు, సిబ్బంది నియామక ప్రక్రియ వేగవంతం చేయండి
- వైద్య, ఆరోగ్య శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 12:
వచ్చే జూన్ 2వ తేదీ నాటికి అల్వాల్, ఎల్ బీ నగర్ టిమ్స్‌లు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ పనులు పూర్తి కావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది డిసెంబరు నాటికి ఉస్మానియా నూతన ఆసుపత్రి పనులు పూర్తి చేసి ప్రజలకు సేవలందించేలా చూడాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ, ఉస్మానియా నూతన ఆసుపత్రుల నిర్మాణ పనులు, ఆయా ఆసుపత్రులకు అవసరమైన పరికరాల కొనుగోలు, వైద్యులు, సిబ్బంది నియామకాలు ఏకకాలంలో పూర్తి కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఒక్కో కుటుంబానికి అందించే వైద్య చికిత్స కవరేజీని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. మూడేళ్లలోనే 9 మెడికల్ కాలేజీలు, 16 నర్సింగ్ కాలేజీలు, 28 పారామెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశామన్నారు.సనత్ నగర్, అల్వాల్, ఎల్‌బీ నగర్ టిమ్స్‌ల్లో వైద్యులు, ఇతర సిబ్బంది నియామకాలకు సంబంధించి ఏకీకృత విధానం పాటించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వైద్య సేవల అవసరాలకు అనుగుణంగా మూడు టిమ్స్ మధ్య వైద్యులు, సిబ్బంది బదిలీలు జరిగేలా ఉండాలన్నారు. ఆసుపత్రుల నిర్వహణ, హౌస్ కీపింగ్ సిబ్బందిని ఔట్ సోర్సింగ్ విధానంలో మిగతా 3లో..

తెలంగాణ రైతులకు తెలుగులోనే ఏఐ వ్యవసాయ సలహాలు

త్వరలో అందుబాటులోకి



హైదరాబాద్, నవంబర్ 12:
తెలంగాణ రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వ్యవసాయ సలహాలను తెలుగులోనే అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా భారత్ విస్తార్ సేవల అమలుకు వ్యవసాయ శాఖ, ఎన్‌ఐఎస్‌జీ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఏఐ ఆధారిత వాయిస్ అసిస్టెంట్ 'భారతి' ద్వారా రైతుల ప్రశ్నలకు సమాధానాలు అందించనున్నారు. పంటల సాగు, వాతావరణ పరిస్థితులు, చీడపీడల నివారణ, నేల ఆరోగ్యం, ఎరువుల వినియోగం, మార్కెట్ ధరలు, ప్రభుత్వ పథకాలపై శాస్త్రీయ సూచనలు అందుబాటులోకి రానున్నాయి.ఇప్పటికే 155261 హెల్ప్‌లైన్ ద్వారా వాయిస్ బాట్ సేవలు ప్రారంభమయ్యాయి. మరో 15 నుంచి 21 రోజుల్లో తెలుగు వెబ్ పోర్టల్, మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 45 నుంచి 60 రోజుల్లో వాట్సాప్ చాట్‌బాట్ సేవలను కూడా ప్రారంభించనున్నారు. సాధారణ ఫోన్ మిగతా 3లో..

ఖాజాగూడ భూవ్యవహారంలో పెద్దల హస్తం



- దాసోజు శ్రవణ్‌రూ.1,000 కోట్ల విలువైన బీసీ స్టడీ సర్కిల్ స్థలాన్ని సాస్‌ఇన్‌ఫ్రాకు కట్టబెట్టారని ఆరోపణ

వివరాలు 2లో..

తెలంగాణ పోలీస్ శాఖలో భారీ బదిలీలు

- 21 మంది ఐపీఎస్ అధికారులకు స్థానచలనం..
- హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా మహేష్ భగవత్ ఏసీబీ డీజీగా చారుసిన్హా..
- ఫైర్ సర్వీసెస్ డీజీగా వీసీ సజ్జనార్



హైదరాబాద్, నవంబర్ 12: తెలంగాణ పోలీస్ శాఖలో ప్రభుత్వం భారీ మార్పులు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మిగతా 3లో..

చర్లపల్లిలో రూ.18 లక్షల విలువైన హషీష్ ఆయిల్ పట్టివేత

- 1.5 కిలోల మాదకద్రవ్యం స్వాధీనం..
- ఒకరి అరెస్ట్, మరో నిందితుడు పరారీ

వివరాలు 2లో..

కాలుష్య కారక సంస్థలపై పీసీబీ కొరడా



18 సంస్థలకు నోటీసులు

హైదరాబాద్, నవంబర్ 12:
కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటించని నిర్మాణ ప్రాజెక్టులు, రెడీమిక్స్ కాంక్రీట్ (ఆర్ ఎంసీ) ప్లాంట్లపై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) కఠిన చర్యలకు సిద్ధమైం ది.నిబంధనలు ఉల్లంఘించిన 18 భవన నిర్మాణ సంస్థలకు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఒక నిర్మాణ ప్రాజెక్టుకు అనుబంధంగా పనిచేస్తున్న ఆర్ఎంసీ ప్లాంట్‌ను మూసివేయాలని ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు.మరో నిర్మాణ ప్రాజెక్టులో కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టకపోవడంతో పనులు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేయాలని బుధవారం జరిగిన టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో నిర్ణయించారు.కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టకుండా నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై మరింత కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు హెచ్చరించారు. తీరు మార్చుకోకపోతే ఆస్తులను సైతం జప్తు చేస్తామని స్పష్టం చేశారు.

కేజ్రీవాల్‌కు బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులు..

- రూ.7 కోట్లు ఇవ్వాలని డిమాండ్
- పోలీసుల దర్యాప్తు ప్రారంభం



న్యూఢిల్లీ, నవంబర్ 12 : ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరుతో హత్య బెదిరింపులు వచ్చినట్లు ఫిర్యాదు అందింది. కేజ్రీవాల్‌తో పాటు ఆయన కుమార్తె హర్షితను హత్య చేస్తామని బెదిరిస్తూ రూ.7 కోట్లు ఇవ్వాలని ఓ వ్యక్తి డిమాండ్ చేసినట్లు సమాచారం.ఈ వ్యవహారం ఢిల్లీలోని తిలక్ నగర్ ఎమ్మెల్యే జర్నైల్ సింగ్ ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. తన వ్యక్తిగత ఫోన్ నంబర్‌కు గుర్తుతెలియని వ్యక్తి మిగతా 3లో..

22-ఎ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకూడదు..
- యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి
- కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం



హైదరాబాద్, నవంబర్ 12:
ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న 22-ఎ భూ సమస్యలను వేగంగా పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. అర్హులైన భూ యజమానులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టం చేశారు.గురువారం సచివాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. జీవో 118, జీవో 76, జీవో 59 అమలు, యూఎల్‌సీ దరఖాస్తులు, నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూములు, అనుమతులు పొందిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లపై చర్చించారు.ప్రతి వారం కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు సమావేశమై దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షించాలని సూచించారు. జిల్లా స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను ఉన్నత స్థాయి కమిటీకి పంపాలని ఆదేశించారు. యూఎల్‌సీకి సంబంధించిన కోర్టు తీర్పులు, ఎస్ఎల్‌పీల దాఖలు తదితర అంశాలపై వారం రోజుల్లో సమగ్ర నివేదిక అందించాలని ఉన్నతస్థాయి కమిటీని ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో అమలైనప్పుడే ప్రజలకు నిజమైన ప్రయోజనం కలుగుతుందని మంత్రి పేర్కొన్నారు.

గిగ్ వర్కర్ల సంక్షేమానికి ప్రత్యేక చట్టం తీసుకొచ్చాం

- నవంబర్ 14నగిగ్ వర్కర్ల ర్యాలీని విజయవంతం చేయాలి
- ఆటో డ్రైవర్లకు వెల్ఫేర్ బోర్డు..
- క్యాబ్, ట్యాక్సీ, ర్యాపిడో కార్మికులకూ ప్రత్యేక చట్టం



వివరాలు 4లో..

● మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

డ్రగ్స్‌పై హైదరాబాద్ పోలీసుల ఉక్కుపాదం





- సింగరేణి కాలనీలో ఆపరేషన్ థండర్‌బోల్ట్..
- ఐదుగురికి పాజిటివ్

హైదరాబాద్, నవంబర్ 12:
మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ పదార్థాల నియంత్రణే లక్ష్యంగా హైదరాబాద్ సిటీ పోలీసుల ఆధ్వర్యంలో నవంబర్ 12న సైదాబాద్ పోలీస్ స్టేషన్ ఎసిపి ఎస్ వెంకట్ రెడ్డి, సైదాబాద్ సీఐ బి చంద్రమోహనరెడ్డిలోని సింగరేణి కాలనీలో ప్రత్యేకంగా ఆపరేషన్ థండర్‌బోల్ట్ నిర్వహించారు. హెచ్ఎన్ఈడబ్ల్యూ విభాగం సమన్వయంతో చేపట్టిన ఈ తనిఖీల్లో 50 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. చార్మినార్ జోన్ డీసీపీ ఖరే కిరణ్ ప్రభాకర్ ఐపీఎస్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో అనుమానాస్పదంగా గుర్తించిన 13 మందికి అక్కడికక్కడే మూత్ర పరీక్షలు నిర్వహించగా, ఐదుగురికి మత్తు పదార్థాల వినియోగానికి సంబంధించిన పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారిపై నిరంతర నిఘా ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైదరాబాద్ నగరవ్యాప్తంగా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

విద్యార్థుల్లో జాతీయ భావాలు పెంపొందించాలి



ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్, నవంబర్ 12: విద్యార్థులు జాతీయ భావాలను పెంపొందించుకుని దేశ అభివృద్ధికి కృషి చేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పిలుపు నిచ్చారు. నాగోల్‌లో నిర్వహించిన బీజేపీ యువమోర్చా సమావేశంలో జాతీయ అధ్యక్షుడు హేమంత్ జోషితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భగత్‌సింగ్ తనకు స్ఫూర్తి అని, చిన్న వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఆయన త్యాగాలు యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. విద్యార్థులు సమా జంలో మార్పు తీసుకొచ్చే శక్తిగా ఎదగాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని ఈటల అన్నారు. ఓటర్ల జాబితా అంశంపై కాంగ్రెస్ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. మోదీ నాయకత్వాన్ని ఎదుర్కొనే శక్తి ప్రతిపక్ష పార్టీలకు లేదని వ్యాఖ్యానించారు.

ఖాజాగూడ భూవ్యవహారంలో పెద్దల హస్తం

- దాసోజు శ్రవణ్‌రూ.1,000 కోట్ల విలువైన బీసీ స్టడీ సర్కిల్ స్థలాన్ని సాస్‌ఇన్‌ఫ్రాకు కట్టబెట్టారని ఆరోపణ



హైదరాబాద్, నవంబర్ 12: శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడలోని సర్వే నంబర్ 20/1లో ఉన్న 3.17 ఎకరాల భూమి వ్యవహా రం వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ ఆరోపించారు. సుమారు రూ.1,000 కోట్ల విలువైన బీసీ స్టడీ సర్కిల్ స్థలాన్ని సాస్ ఇన్‌ఫ్రాకు కట్టబెట్టి రేవంత్ ప్రభుత్వం చారిత్రక ద్రోహానికి పాల్పడిందని విమర్శించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం బీఆర్ఎస్ నేత కురువ విజయ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 2020 జనవరి 13న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రాసిన లేఖలో సాస్ సంస్థ అనధికారికంగా భూమిని ఆక్రమించినట్లు పేర్కొన్నారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో రూ.1.93 కోట్ల జరిమానా విధించడంతోపాటు భూమిని ఖాళీ చేయించారని తెలిపారు. 2025 నవంబర్ 1న అప్పటి కలెక్టర్ నారాయణరెడ్డి ఈ భూమిని 22-ఏ జాబితాలో చేర్చారని చెప్పారు. అయినప్పటికీ ప్రభుత్వ పెద్దల అండతో టైటిల్ వెరిఫికేషన్ లేకుండానే హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, హైడ్రా పరిధిలో అనుమతులు పొంది భారీ భవనాల నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. ఈ భూవ్యవహారంపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, బీజేపీ నేత కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీసీఎల్ఏ, హైడ్రాకు లేఖలు రాసినా స్పందన లేదని విమర్శించారు. లిడ్‌క్యాప్ భూములపైనా ఆరోపణలు గచ్చిబౌలిలోని మలం చెరువు ఎదురుగా, దుర్గం చెరువు వెనుక ఉన్న లిడ్‌క్యాప్ (టీజీ లిప్‌కో)కు చెందిన ఆరు ఎకరాలకు పైగా భూమిని అపర్ణ, వంశీరామ్ బిల్డర్స్‌కు అప్పగించారని దాసోజు శ్రవణ్ ఆరోపించారు. ఈ భూమి విలువ సుమారు రూ.6,000 కోట్లు ఉంటుందని పేర్కొ న్నారు.ఏక్తా మాల్ పేరుతో తొలుత ఒక ఎకరం భూమిని తీసుకుని, అనంతరం దాన్ని రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుగా మార్చేందుకు మిగిలిన భూమిని కూడా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారని విమర్శించారు.

చర్లపల్లిలో రూ.18 లక్షల విలువైన హషీష్ ఆయిల్ పట్టివేత

- 1.5 కిలోల మాదకద్రవ్యం స్వాధీనం..
- ఒకరి అరెస్ట్, మరో నిందితుడు పరారీ





హైదరాబాద్, నవంబర్ 12:
మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఎస్ఓటీ ఉప్పల్ జోన్ బృందం, చర్లపల్లి పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి రూ.18 లక్షల విలువైన 1.5 కిలోల హషీష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఒకరిని అరెస్టు చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. నిందితుడి నుంచి మొబైల్ ఫోన్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. విశాఖపట్నం జిల్లా అనకాపల్లికి చెందిన నాగులపల్లి సురేష్ కుమార్ (38) బీపీసీఎల్‌లో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెండు నెలల క్రితం విశాఖపట్నం జిల్లా చింత పల్లికి చెందిన సుబ్బారావుతో అతడికి పరిచయం ఏర్పడింది. అధిక కమీషన్ ఆశ చూపిన సుబ్బారావు, హషీష్ ఆయిల్‌ను రవా ణా చేయాలని సురేష్ కుమార్‌ను ప్రలోభపెట్టినట్లు పోలీసులు తెలిపారు.ఈ నెల 10న చింతపల్లిలో సుబ్బారావు నుంచి 1.5 కిలోల హషీష్ ఆయిల్‌ను బ్యాక్‌ప్యాక్‌లో తీసుకున్న సురేష్ కుమార్ బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరాడు. సరుకును నగరంలో అప్పగిస్తే ప్రయాణ ఖర్చుల కింద రూ.1,500తో పాటు రూ.లక్ష కమీషన్ ఇస్తానని సుబ్బారావు హామీ ఇచ్చినట్లు పోలీసులు వెల్లడించారు.ఈ క్రమంలో ఈ నెల 12న ఉదయం 10.40 గంటలకు చర్లపల్లి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్ 1 ఉత్తరం వైపు పార్కింగ్ ప్రాంతంలో సరుకును అప్పగించేందుకు వేచి ఉన్న సురేష్ కుమార్‌ను విశ్వసనీయ సమాచారంతో పోలీసులు పట్టుకున్నారు. అతడి బ్యాగును తనిఖీ చేయగా 1.5 కిలోల హషీష్ ఆయిల్ లభించింది. దీంతో నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.ఈ కేసులో ప్రధాన సరఫరాదారుగా ఉన్న సుబ్బారావు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతడి కోసం గాలింపు చేపట్టడంతో పాటు, ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న ఇతర వ్యక్తుల వివరాలను సేకరించేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ఐపీఎస్ పర్యవేక్షణలో, ఉప్పల్ జోన్ డీసీపీ కె. సురేష్ కుమార్, ఎస్ఓటీ డీసీపీ కె. మనోహర్ మార్గదర్శకత్వంలో ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఉప్పల్ డివిజన్ ఏసీపీ వై. వెంకట్ రెడ్డి, చర్లపల్లి ఇన్‌స్పెక్టర్ ఎ. సుధాకర్, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ ఎన్. వసంత కుమార్‌తో పాటు పోలీసు సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలకు సంబంధిం చిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని మల్కాజిగిరి కమిషనరేట్ ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

నాచారం సర్కిల్‌లో పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్





- వీపీల వద్ద ప్రతిరోజూ చెత్త తొలగించాలి..
- అధికారులకు కమిషనర్ ఆదేశాలు

హైదరాబాద్, నవంబర్ 12:
మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి,నాచారం సర్కిల్‌లో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహిం చారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయే ప్రాంతాలను (జీవీపీలు) పరిశీలించి, పారిశుధ్య పరిస్థితులను సమీక్షించారు.జీవీపీల వద్ద ప్రతి రోజూ నిర్ణీత సమయంలో చెత్తను తొలగించాలని, ఎక్కడా చెత్త పేరుకుపోకుండా పారిశుధ్య సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. చెత్త తొలగింపులో జాప్యం జరగకుండా శానిటేషన్ బృందాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అలాగే చెత్త పేరుకుపోయే ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ చేపట్టి, తిరిగి చెత్త వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజా ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు గుర్తించిన జీవీపీలను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారు లకు సూచించారు.పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు, పారిశుధ్య సిబ్బంది సమిష్టిగా కృషి చేసి ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పిం చాలని కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో నాచారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నిత్యా నంద్, శానిటేషన్ అధికారి రఘుపతి, మున్సిపల్ అధికా రులు శానిటేషన్ బృందాలు మరి కొందరు పాల్గొన్నారు.

జీసీసీలతో తెలంగాణ ఆర్థిక ప్రగతికి ఊతం





- ప్రస్తుతం 400 మందికి ఉపాధి
- భవిష్యత్తులో ఉద్యోగుల సంఖ్య వెయ్యికి పెరిగే అవకాశం:
- మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, నవంబర్ 12:
తెలంగాణ ఆర్థికాభివృద్ధిలో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు (జీసీసీ) కీలక పాత్ర పోషించనున్నాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. హైదరాబాద్‌ను ఐటీ సేవల కేంద్రంగానే కాకుండా ప్రపంచస్థాయి టెక్నా లజీ, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మార్స్ సంస్థ 60 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్‌ను గురువారం మంత్రి ప్రారం భించారు. మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్, ప్రొడక్ట్ డిజైన్, ఇంజి నీరింగ్, పరిశోధన రంగాల్లో జీసీసీలకు విస్తృత అవకా శాలు ఉన్నాయని చెప్పారు. ఐటీ రంగాన్ని ఇతర పరిశ్ర మలతో అనుసంధానించి కొత్త పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.జెన్‌పాక్ట్ సహకారంతో ఏర్పాటైన ఈ కేంద్రం ద్వారా ప్రస్తుతం 400 మందికి పైగా ఉపాధి లభించనుందని, భవిష్యత్తులో ఈ సంఖ్యను వెయ్యికి పెంచే అవకాశం ఉందని వెల్లడించారు. తెలంగాణ రైజింగ్-2047 విజన్‌లో భాగంగా టెక్నాలజీ, పారిశ్రామిక, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు.

ఖైతలాపూర్ చెరువులను కాపాడిన హైడ్రా

- 9.06 ఎకరాల ఎఫ్‌టీఎల్ పరిధిని కాపాడుతూ హైడ్రా ఫెన్సింగ్



హైదరాబాద్, నవంబర్ 12: మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి మండలం ఖైతలాపూర్ గ్రామంలోని ఖైతలాపూర్ చెరువులను హైడ్రా గురువారం కాపాడింది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని 9.06 ఎకరాల భూమి కబ్జాలకు గురి కాకుండా చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసింది. ఫెన్సింగ్ వేయడంలో భాగంగా.. పొదలో కనిపించ కుండా ఉన్న సమాధి రాయి జేసీబీకి తగిలి తొలగడంతో స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది. ముళ్ల పొదలను జేసీబీతో తొలగించే క్రమంలో సమాధిగా గుర్తించేందుకు ఉద్దేశించి పాతిన రాయి తొలగడంతో ఈ ఇబ్బంది ఏర్పడింది. ఆ రాయి ఉన్న శ్మశాన స్థలాన్ని మినహాయించి ఎఫ్‌టీఎల్ పరిధిని కాపాడుతూఫెన్సింగ్ వేసినట్లు అక్కడ పనులను పర్యవేక్షి ంచిన హైడ్రా అధికారి వెల్లడించారు. ఇదే సమయంలో పోలీసులు కూడా వచ్చి అక్కడ ఎలాంటి ఇబ్బంది లేకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. చెరువు ఎఫ్‌టీఎల్‌కు చెందిన భూమిగా పేర్కొంటూ ఫెన్సింగ్ వేయడంతో పాటు.. హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది.

శాంతియుత నిరసన తెలుపుతున్న ప్రొఫెసర్ల అరెస్ట్



వీసీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

హైదరాబాద్, నవంబర్ 12:
మహిళా ప్రొఫెసర్లపై వేధింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఎదు ర్కొంటున్న ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యా లయం వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్యపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రొఫెసర్లు, యూనివర్సిటీ సిబ్బంది, విద్యార్థులు ఆం దోళన కొనసాగిస్తున్నారు.బాధిత మహిళా ప్రొఫెసర్ తేజశ్రీకి మద్దతుగా విశ్వవిద్యాలయంలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రొఫె సర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వీసీపై చర్యలు తీసుకోకుండా, బాధిత మహిళా ప్రొఫెసర్‌ను అరెస్ట్ చేయడంపై పోలీసులకు, ప్రొఫెసర్లకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.అరెస్ట్ చేసిన ప్రొఫెసర్లను పోలీసులు కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమను బలవంతంగా అరెస్ట్ చేయడం సిగ్గుచేటని ప్రొఫెసర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీసీపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్మిక సంఘం ఎన్నికల్లో బీఆర్టీయూ ఘన విజయం



హెచ్ఎంఎస్‌పై 13 ఓట్ల మెజార్టీ

హైదరాబాద్, నవంబర్ 12:
పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జేకే ఫెన్నార్ పరిశ్రమలో గురువారం నిర్వహించిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బీఆర్టీయూ ఘన విజయం సాధించింది. సమీప ప్రత్యర్థి హెచ్ఎంఎస్‌పై 13 ఓట్ల మెజార్టీతో గెలుపొందింది.మొత్తం 247 ఓట్లు పోలవగా, బీఆర్టీయూకు 103, హెచ్ఎంఎస్‌కు 93, సీఐటీయూకు 48 ఓట్లు వచ్చాయి. మరో మూడు ఓట్లు చెల్లనివిగా నమోదయ్యాయి. దీంతో బీఆర్టీయూ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో విజయం సాధించింది.

నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 12:
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. 2021 ఏప్రిల్ 11న నాగార్జునసాగర్ ఉప ఎన్నికల ప్రచార సమయంలో మాస్కులు ధరించకుండా, కొవిడ్ నిబంధ నలు ఉల్లంఘించారనే ఆరోపణలతో రేవంత్ రెడ్డితోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదైంది.ఈ కేసు విచారణలో భాగంగా ముఖ్యమంత్రి నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు.

సంపాదకీయం

తెలంగాణ రైతులకు తెలుగులోనే ఏఐ వ్యవసాయ సలహాలు

వినియోగించే రైతులకు సైతం వాయిస్ కాల్స్ ద్వారా సేవలు అందించనున్నారు. సాగు ఖర్చులు తగ్గించి, దిగుబడులు, రైతుల ఆదాయం పెంచడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు.

జూన్ 2 నాటికి టిమ్స్‌లు పూర్తి స్థాయి సేవలందించాలి

చేపట్టాలని సీఎం సూచించారు. టిమ్స్ ల పర్యవేక్షణకు గ్రూప్-1 అధికారులను నియమిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హౌస్ కీపింగ్ సిబ్బందిపై పర్యవేక్షణకు విశ్రాంత సైనికాధికారులను నియమిస్తామన్నారు. నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలకు వేరే సిబ్బంది ఉంటే, వైద్యులు పూర్తిగా వైద్య సేవలపైనే దృష్టి సారించే అవకాశం ఉంటుందని సీఎం అన్నారు. నిమ్స్ లో శస్త్రచికిత్సలకు సమయం ఎక్కువ తీసుకుంటున్నందున సనత్ నగర్ టిమ్స్‌ను పూర్తి స్థాయిలో వినియోగించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నిమ్స్‌లో బెడ్స్ లేకపోయినా, శస్త్రచికిత్సలకు ఆలస్యమైనా సనత్ నగర్ టిమ్స్‌ను వినియోగించుకోవాలన్నారు. ఈ విషయంలో వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, నిమ్స్, టిమ్స్ డైరెక్టర్లు నిత్యం సమన్వయం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. టిమ్స్ లో వైద్యుల నియామకం పూర్తయ్యే వరకు బయటి నుంచి వైద్యులను నియమించుకోవాలని, అందుకు అవసరమయ్యే మొత్తాన్ని వెంటనే విడుదల చేస్తామని సీఎం తెలిపారు. వైద్యులు, సిబ్బంది నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. తాము అధికారంలోకి వచ్చాక కొత్తగా 16 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. నిర్మాణంలో ఉన్నమరో 79 డయాలసిస్ సెంటర్ల పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. టిమ్స్ తో పాటు బోధన కళాశాలలు, నర్సింగ్ కళాశాలల పనులు, పరికరాల కొనుగోలు ప్రక్రియ ఏకకాలంలో పూర్తవ్వాలని, అందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుప్రతుల్లో వైద్యులు, సిబ్బంది హాజరైన సమయం, విధుల నుంచి వెళ్లే సమయాన్ని నమోదు చేయాలని, హాజరు విషయంలో బయోమెట్రిక్ విధానం అమలయ్యేలా చూడాలని, ఏఐతో పర్యవేక్షణ చేయాలని సీఎం శాఖాధికారులను ఆదేశించారు. మూడేళ్లలోనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో బెడ్ల సంఖ్యను 30 వేల నుంచి 38 వేలకు పెంచిన విషయాన్ని అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔట్ పేషెంట్ల (ఓపీ) సంఖ్య 7 లక్షల నుంచి 9 లక్షలకు పెరగడం, ఇన్ పేషెంట్ల (ఐపీ) సంఖ్య 23 లక్షల నుంచి 24.30 లక్షలకు పెరగడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి గతంలో సగటున 3.9 శాతం కేటాయించగా, గత మూడేళ్లుగా సగటున 4.8 శాతం నిధులు కేటాయిస్తున్న విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. మూడేళ్లలోనే వైద్యులు, నర్సులు, ఏఎన్ఎంలు, పారా మెడికల్ సిబ్బంది కలిపి 13,401 నియామకాలు పూర్తి చేశామని సీఎం తెలిపారు. మరో 5,640 నియామకాల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ప్రజారోగ్యానికి పెద్ద పీట వేసే క్రమంలో వైద్యారోగ్య శాఖకు అవసరమైన నిధులను ఎంత మొత్తమైనా విడుల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సమీక్షలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జోంగ్తూ, టీజీఎంఎస్ఐడీసీ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్, వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ ముష్రఫ్ అలీ ఫరూఖీ, ఆర్ అండ్ బీ కార్యదర్శి ఇలంబరితి, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్, టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పోలీస్ శాఖలో భారీ బదిలీలు

పలువురు సీనియర్ అధికారులకు కీలక బాధ్యతలు అప్పగించింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా మహేష్ భగవత్, ఫైర్ అండ్ డిజాస్టర్ రెస్పాన్స్ డీజీగా వీసీ సజ్జనార్, ఏసీబీ డీజీగా చారు సిన్హా నియమితులయ్యారు. ఆర్టీసీ ఎండీగా అనిల్ కుమార్, పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా నాగిరెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఉమెన్ అండ్ సేఫ్టీ డీజీగా సౌమ్య మిశ్రా, ప్రిజన్స్ డీజీగా స్వాతి లక్రా, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ డీజీగా విక్రమ్‌సింగ్ మాన్ నియమితులయ్యారు. లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీగా అకున్ సబర్వాల్‌కు బాధ్యతలు అప్పగించారు. ఇతర కీలక నియామకాల్లో భాగంగా స్టీఫెన్ రవీంద్రకు ౹+-౹హీూ=ూ డైరెక్టర్‌గా, కార్తికేయకు మల్టీజోన్-1 ఐజీగా, కె. రమేష్ నాయుడుకు రైల్వేస్ ఐజీగా బాధ్యతలు కేటాయించారు. తాజా బదిలీలతో రాష్ట్ర పోలీస్ యంత్రాంగంలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి.

కేజ్రీవాల్‌కు బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులు..

కాల్ చేయడంతో పాటు వాట్సాప్ సందేశం పంపినట్లు ఆయన పోలీసులకు తెలిపారు. నవంబర్ 6న మొహాలీ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్ఎస్పీ)కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఫోన్ చేసిన వ్యక్తి తాను లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుడినని చెప్పుకుంటూ రూ.7 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులో వెల్లడించారు. డబ్బులు ఇవ్వకపోతే కేజ్రీవాల్, ఆయన కుమార్తెను హత్య చేస్తామని బెదిరించినట్లు తెలిపారు. కాల్‌లో చెప్పిన విషయాలనే వాట్సాప్ సందేశంలోనూ పంపినట్లు పేర్కొన్నారు. సంబంధిత స్క్రీన్‌షాట్‌ను పోలీసులకు అందజేశారు. ఫిర్యాదుపై ప్రాథమిక విచారణ చేపట్టిన మొహాలీ సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తుతెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బెదిరింపులకు ఉపయోగించిన ఫోన్ నంబర్ ఆధారంగా నిందితుడిని గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.

సంప్రదాయ కళలకు అంతర్జాతీయ వేదిక

చేనేత, కలంకారీ, కొండపల్లి బొమ్మలకు ప్రత్యేక ప్రదర్శనలు..

అరకు కాఫీ, టేస్ట్ ఆఫ్ ఆంధ్రా ఆకర్షణ।

ఏపీ సంస్కృతి, పారిశ్రామిక ప్రగతిని ఒకే వేదికపై ఆవిష్కరణ

అమరావతి, నవంబర్ 12 : 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, సంప్రదాయాలు, పారిశ్రామిక ప్రగతిని ప్రతిబింబించే ప్రత్యేక ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత వస్త్రాలు, కలంకారీ కళాఖండాలు, కొండపల్లి బొమ్మలు, సవర గిరిజన కళాకృతులను ప్రత్యేక స్టాళ్లలో ప్రదర్శించారు. అరకు కాఫీ, సుగంధ ద్రవ్యాలు, సంప్రదాయ ఆహార పదార్థాలతో ఏర్పాటు చేసిన టేస్ట్ ఆఫ్ ఆంధ్రా విభాగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డిజిటల్ సాంకేతికతతో పర్యాటక ప్రాంతాలను పరిచయం చేయడంతోపాటు ఫుడ్ ప్రాసెసింగ్, గ్రీన్ ఎనర్జీ, ఉక్కు, గ్రీన్ అమ్మోనియా రంగాల్లో పెట్టుబడుల అవకాశాలను వివరించారు. స్థానిక కళాకారుల ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు కల్పించేలా ఈ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

ఏపీ ఉత్పత్తులకు వాల్‌మార్ట్, ఫ్లిప్‌కార్ట్ మార్కెట్

మహిళా సంఘాలు, స్థానిక కళాకారుల ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెట్ కల్పించాలి..

మంత్రి లోకేశ్ ప్రతిపాదన

ఏపీ నుంచి ఏటా 6.5 కోట్ల పౌండ్లకు పైగా రొయ్యల కొనుగోలు

అమరావతి, నవంబర్ 12 : రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాలు, స్థానిక కళాకారులు తయారుచేసే ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ అవకా శాలు కల్పించాలని మంత్రి నారా లోకేశ్ వాల్‌మార్ట్, ఫ్లిప్‌కార్ట్ ప్రతినిధులను కోరారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు సందర్భంగా వాల్ మార్ట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పాల్ డైక్‌తో సమావేశమైన ఆయన.. స్వయం ఏపీ, లేపాక్షి బ్రాండ్ల ఉత్పత్తులను సంస్థల సరఫరా వ్యవస్థల్లో చేర్చాలని ప్రతిపాదించారు. ఏపీలో నిర్వహించే ఎంఎస్ఎంఈ కార్యక్రమానికి అంతర్జాతీయ కొనుగోలుదారులను ఆహ్వానించాలని కోరారు. ఏపీ నుంచి వాల్‌మార్ట్ ఏటా 6.5 కోట్ల పౌండ్లకు పైగా రొయ్యలను కొనుగోలు చేస్తోందని పాల్ డైక్ తెలిపారు. ఫ్లిప్‌కార్ట్ కార్యకలాపాల ద్వారా రాష్ట్రంలో 28 వేల మందికి పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించిందన్నారు. రాష్ట్రానికి చెందిన 3,200కు పైగా ఎంఎస్ఎంఈలకు శిక్షణ అందించగా, 900కు పైగా సంస్థలను మార్కెట్‌ప్లేస్‌లో భాగస్వాములుగా చేర్చినట్లు వివరించారు.

ముప్పు ఏ రూపంలో వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

● రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



న్యూఢిల్లీ, నవంబర్ 12 : యుద్ధతంత్రాలు మారుతున్న నేపథ్యంలో ఎలాంటి రూపంలోనైనా ముప్పు పొంచి ఉండవచ్చని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు, అవసరమైతేఆకస్మికదాడులు నిర్వహించేందుకు సైన్యం సర్వసన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో నిర్వహించిన వైమానిక దళ కమాండర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రక్షణ, ప్రతిదాడుల విషయంలో అధునాతన వ్యూహాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిఘా, పర్యవేక్షణ సామర్థ్యాలను నిరంతరం పెంచుకోవాలని సూచించారు. ముప్పును ముందుగానే గుర్తించి, నష్టం జరగ కుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సైనికాధికారులకు దిశా నిర్దేశం చేశారు. శత్రువులు కోలుకునే అవకాశం ఇవ్వని సామర్థ్యాలను రక్షణ దళాలు పెంపొందించుకోవాలన్నారు. శత్రువులు ఆకస్మికంగా దాడులకు దిగినా వారి వ్యూహాలకు చిక్కకుండా ముందస్తు అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. మన చర్యలు శత్రువుల ఊహలకు అందని విధంగా ఉండాలని పేర్కొ న్నారు. గూఢచార, నిఘా వ్యవస్థలను మరింత బలోపేతం చేసు కోవాలని, ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనేందుకు నిరంతరం సిద్ధంగా ఉండాలని అన్నారు. ఉక్రెయిన్-రష్యా, ఇజ్రాయెల్-హ మాస్ యుద్ధాలను ప్రస్తావిస్తూ.. ఆధునిక యుద్ధాల్లో రైఫిళ్లతో పాటు డ్రోన్లు, వైమానిక రక్షణ వ్యవస్థల ప్రాధాన్యం పెరిగింద న్నారు. ఆత్మాహుతి డ్రోన్లు, నిఘా డ్రోన్ల వల్ల ఎదురయ్యే సవా ళ్లను సమర్థంగా ఎదుర్కొనేలా సన్నద్ధంకావాలని సూచిం చారు. సైబర్ యుద్ధాలు, అంతరిక్షంలో ఆయు ధాలను మోహరించి శత్రువులపై దాడులు చేసే అత్యాధునిక యుద్ధతంత్రాలకు అనుగుణంగా ప్రత్యేక విధానాలను అభివృద్ధి చేయాలని వైమానిక దళానికి పిలుపునిచ్చారు.

భారత్ సమ్మిట్‌కు ఖర్గే, డీకే శివకుమార్‌కు భట్టి విక్రమార్క ఆహ్వానం





● బెంగళూరులో ఏఐసీసీ అధ్యక్షుడు, కర్ణాటక ముఖ్యమంత్రితో ఉప ముఖ్యమంత్రి భేటీ

న్యూఢిల్లీ, నవంబర్ 12 : తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న భారత్ సమ్మిట్-2026కు హాజరుకావాల్సిందిగా ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రముఖులను ఆహ్వానిస్తున్నారు. గురువారం ఆయన బెంగళూరులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భారత్ సమ్మిట్-2026కు హాజరుకావాల్సిందిగా వారిని ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికలను అందజేశారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ స్థాయి సదస్సులో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భట్టి విక్రమార్క వారిని కోరారు. ఈ సమ్మిట్ ద్వారా తెలంగాణలోని అభి.వృద్ధి, పెట్టుబడుల అవకాశాలు, వివిధ రంగాల్లో రాష్ట్ర దార్శని కతను అంతర్జాతీయ వేదికపై చర్చించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

జాతీయ స్థాయిలో పెట్టుబడుల భద్రతా చట్టం చేయాలి

● ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రి పీయూష్ గోయల్,

● డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో కలిసి ఏపీ పెవిలియన్ ప్రారంభించిన సీఎం

న్యూఢిల్లీ, నవంబర్ 12 : వేగవంతమైన అభివృద్ధికి జాతీయ స్థాయిలో పెట్టుబడుల భద్రతా చట్టం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్రాన్ని కోరారు. రెండు రోజుల 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సును కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి సీఎం చంద్రబాబు ప్రారంభించారు. విశాఖపట్నంలో గురువారం ప్రారంభమైన సీఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరైన వివిధ దేశాల పారిశ్రామిక ప్రతినిధులు, రాయబారులు, ప్రభుత్వ ప్రతినిధులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. కొన్ని కీలక ప్రతిపాదనలు చేశారు. అలాగే రాష్ట్రంలో వివిధ రంగాల్లో జరుగుతోన్న అభివృద్ధిని పారిశ్రామికవేత్తలకు వివరించారు. పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి తెలియజేశారు. ఏయే ప్రాంతాల్లో ఏయే రంగాలకు చెందిన పెట్టుబడులకు అవకాశం ఉందో ప్రజెంట్ చేశారు. దీంతో పాటు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పట్నుంచి జరిగిన ప్రగతిని సీఎం వివరించారు. ఈ సందర్బంగా సీఎం చంద్రబాబు పెట్టుబడుల భద్రతకు సంబంధించి కీలక ప్రతిపాదనలు చేశారు. పెట్టుబడులు పెట్టే పారిశ్రామిక వేత్తల్లో నమ్మకం, ఉత్సాహం కల్గించేందుకు పారిశ్రామిక రాయితీలకు సంబంధించి ఎస్క్రో ఖాతాను తెరుస్తున్నామని చెప్పారు. దీంతో పాటు పెట్టుబడుల రక్షణ చట్టం చేయడానికి తాము సిద్దంగా ఉన్నామని ప్రకటించారు. రాష్ట్రస్థాయిలో పెట్టుబడుల చట్టం చేసి కేంద్రానికి పంపుతామని... దాన్ని కేంద్రం ఆమోదించాలని కోరారు. జాతీయ స్థాయిలో కూడా పెట్టుబడుల భద్రతా చట్టాన్ని చేస్తే భారతదేశ అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాల మధ్య వైరుధ్యాలకు పెట్టుబడిదారులు బలికాకూడదని, వచ్చే పెట్టుబడులకు శాశ్వత భరోసా కల్పించేందుకు ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ అవసరమన్నారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వంపై నమ్మకం, ఇచ్చిన హామీల అమలుపై భరోసా కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన జన్ విశ్వాస్ పిలుపునకు అనుగుణంగా ఏపీలో పాలన సాగిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో పరిశ్రమలకు రియల్ టైమ్‌లో అనుమతులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. పెట్టుబడులకు సంబంధించిన ప్రక్రియల్లో జాప్యం లేకుండా వేగంతో అనుమతులు ఇచ్చే విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు, భూమి కేటాయింపులు, ప్రోత్సాహకాలను వేగంగా అందిస్తున్నామని తెలిపారు. ఏపీలో ఈ విధానం అమలుకు కియా కార్ల పరిశ్రమ ఒక ఉదాహరణగా పేర్కొన్నారు. ఆమ్కా డిఫెన్స్ ప్రాజెక్టుకు కేవలం 36 రోజుల్లోనే అనుమతులు మంజూరు చేసి భూమి కేటాయించామని, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ సంస్థ కూడా 19 నెల్లోనే సిద్దమైందని... ఇది ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని వెల్లడించారు. నమ్మకంతో పెట్టుబడులు...ఈ సదస్సులో వచ్చే పెట్టుబడులతో కలిపి ఇప్పటివరకు రాష్ట్రానికి రూ.32 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించినట్టవుతుందని ముఖ్యమంత్రి వెల్లడించారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఎస్క్రో ఖాతా ద్వారా అందించడం వల్ల వాటి చెల్లింపుల్లో పారదర్శకత, విశ్వసనీయత పెరుగుతాయని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా కీలకంగా మారనున్న సాంకేతిక, పారిశ్రామిక రంగాలను ప్రాధాన్యంగా తీసుకున్నామని చంద్రబాబు వివరించారు. రేర్ ఎర్త్ మాగ్నెట్స్, స్టీల్ ఉత్పత్తి, సోలార్ వేఫర్లు, సౌర విద్యుత్తు, బ్యాటరీ ఎనర్జీ రంగాల్లో పెద్దఎత్తున అవకాశాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. క్రిటికల్ మినరల్ మిషన్, స్టీల్ పాలసీ, సోలార్ మిషన్, రక్షణ రంగంలో ఆత్మనిర్భరత, అంతరిక్ష రంగానికి స్పేస్ విజన్, సెమీకండక్టర్ మిషన్, లాజిస్టిక్స్ పాలసీ, క్వాంటం టెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్, మారిటైమ్ రంగాల అభివృద్ధికి కార్యాచరణ చేపట్టామని చెప్పారు. అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు చేయడంతో పాటు, క్వాంటం పరికరాలను మేడ్ ఇన్ అమరావతి బ్రాండుతో తయారు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. పౌర అవసరాలు, రక్షణ రంగ అవసరాలకు ఉపయోగపడే డ్రోన్ల తయారీ కోసం ప్రత్యేకంగా డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే మారుమూల ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా ఔషధాలను రవాణా చేస్తున్నామని వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించి ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి ఉద్యానవన ఉత్పత్తుల కేంద్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలో 25 సెక్టోరల్ పార్కులను ఏర్పాటు చేస్తున్నామని, తిరుపతిని గ్లోబల్ సెమీకండక్టర్ చిప్ డిజైన్ కేంద్రంగా అభివృద్ధి చేయనున్నామని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలు, మౌలిక సదుపాయాలను ఒకే చోట అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో నదుల అనుసంధానం కీలకంరాష్ట్ర పారిశ్రామిక, వ్యవసాయ, ఆర్థిక అభివృద్ధికి నీటి లభ్యత అత్యంత కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. నదుల అనుసంధానం ద్వారా సాగు, తాగునీటి అవసరాలతో పాటు పారిశ్రామిక అవసరాలకు కూడా నీటిని అందించేలా కార్యాచరణ చేపట్టామని వివరించారు. గోదావరి జలాలను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు తరలించడం ద్వారా విశాఖపట్నం, అమరావతి వంటి కీలక నగరాల నీటి అవసరాలను తీర్చే అవకాశం ఉందన్నారు. గోదావరి కుడి, ఎడమ కాలువల వ్యవస్థను సమర్థంగా వినియోగించుకోవడంతో పాటు, గోదావరి నుంచి కావేరి నదికి నీటిని తరలించే అవకాశాలపైనా దృష్టి సారించామని తెలిపారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానం ద్వారా ఐదు రాష్ట్రాల నీటి అవసరాలను తీర్చే అవకాశం ఉందని ముఖ్యమంత్రి వివరించారు. విద్యుత్ సరఫరాకు గ్రిడ్ ఉన్నట్లుగానే నీటి సరఫరాకు కూడా వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తే ప్రజలకు, రైతులకు, పరిశ్రమలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. నీటి లభ్యతను పెంచడం ద్వారా వ్యవసాయ రంగానికి భరోసా కల్పించడంతో పాటు, పారిశ్రామిక అవసరాలకు నిరంతరాయంగా నీటిని అందించవచ్చని చెప్పారు. నదుల అనుసంధానం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, ప్రాంతాల మధ్య సమతుల్య అభివృద్ధికి దోహదపడుతుందని స్పష్టం చేశారు. వాటర్ గ్రిడ్ కలను సాకారం చేయగలిగేది ప్రధాని నరేంద్ర మోదీ మాత్రమేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అమరావతి నుంచి తిరుపతి వరకు అభివృద్ధి కేంద్రాలుఅమరావతిని బ్లూ-గ్రీన్ సిటీగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రపంచస్థాయి రాజధానిగా నిర్మిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు.

రైస్ మిల్లర్లతో కాంగ్రెస్ ప్రభుత్వం కుమ్మక్కు




● బీఆర్ఎస్ నేతల ఆరోపణ

హైదరాబాద్, నవంబర్ 12: రైస్ మిల్లర్లతో కాంగ్రెస్ ప్రభుత్వం కుమ్మక్కై ందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. భువనగిరి మండలంలోని అనాజీపూర్, నందనం, నాగిరెడ్డిపల్లి గ్రామాలను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జనగాం పాండు, రాష్ట్ర సర్పంచ్ ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ జక్క రాఘవేందర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి ప్రతి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ, 20 రోజులుగా కొనుగోళ్లు జరగడం లేదని ఆరోపించారు. రైస్ మిల్లర్లతో కుమ్మక్కై దళారీ వ్యవస్థకు ప్రభుత్వం మద్దతు ఇస్తోందని విమర్శించారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళారులు రైతుల నుంచి క్వింటాల్ ధాన్యాన్ని రూ.1,800 నుంచి రూ.1,900కే కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటివరకు కల్లాలకు అవసరమైన గోనె సంచులను కూడా సరఫరా చేయలేదన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కేశవపట్నం రమేష్, మాజీ సింగిల్ విండో చైర్మన్ బల్గురి మధుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు గోద శ్రీనివాస్ గౌడ్, మదర్ డెయిరీ డైరెక్టర్ కస్తూరి పాండు, నందనం సర్పంచ్ నాగెల్లి గిరిజ రమేష్ గౌడ్, ఇతర నాయకులు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

అమెరికాలో తెలుగు విద్యార్థిని అదృశ్యం

ఎనిమిది రోజులుగా కొనసాగుతున్న గాలింపు



హైదరాబాద్, నవంబర్ 12: అమెరికా లోని యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్ బోస్టన్‌లో చదువుతున్న తెలుగు విద్యార్థిని కోయ శ్రీజా రెడ్డి అదృశ్యమై ఎనిమిది రోజులు గడి చినా ఆచూకీ లభించలేదు. ఆమెను సురక్షితంగా తీసుకువచ్చేందుకు అన్ని విధాలా ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) కోఆర్డినేటర్ సొంపల్లి కృష్ణప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 2 నుంచి శ్రీజారెడ్డి కనిపించకుండా పోయినట్లు పేర్కొన్నారు. మొదటి రోజు నుంచే బోస్టన్ పోలీస్ విభాగం, విశ్వవిద్యాలయ అధికారులతో సమన్వయం చేసుకుంటూ గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నామని వివరించారు. భారత కాన్సులేట్‌తోపాటు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా ఈ వ్యవహారంపై చొరవ తీసుకున్నారని తెలిపారు. మసాచుసెట్స్ రాష్ట్ర ఉన్నతాధికారులు, భారత విదేశాంగ మంత్రిత్వ శాఖతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు.

జోగినపల్లి సంతోష్ కుమార్‌ను కలిసిన అంబర్‌పేట హరితసేన సభ్యులు



హైదరాబాద్, నవంబర్ 12: గ్రీన్ ఇండియా అధినేత అయిన జోగినపల్లి సంతోష్ కుమార్‌ను కలి సిన అంబర్‌పేట హరితసేన సభ్యులు. ఈ కార్యక్రమంలో అంబ ర్‌పేట నియోజకవర్గ హరితసేన ఇన్‌చార్జి నిరంజన్ పూలే, హరిత సేన బాగ్ అంబర్‌పేట అధ్యక్షురాలు బండారి పద్మజా ముదిరాజ్, హరితసేన నల్లకుంటఅధ్యక్షురాలు పాటూరి స్వప్న, గోల్నాక అధ్యక్షులు సురేష్ గౌడ్, నిమ్మల యాదగిరి, నల్గొండ నరేందర్ సాయిరాం గౌడ్,భూపతి,రజిని,క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

ప్రపంచ సమస్యలకు పరిష్కార మార్గాలు

- ప్రజాస్వామ్యం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఏఐ, వాతావరణ మార్పులపై చర్చలు
- "తెలంగాణ రైజింగ్"పై ప్రత్యేక ప్యానెల్ డిస్కషన్స్
- 'భారత్ సమ్మిట్ 2026' స్వాగత కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు





హైదరాబాద్, నవంబర్ 12:
ప్రస్తుతం ప్రపంచం అనేక సమస్యలు, సవాళ్లను ఎదుర్కొంటోందని, వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు 'భారత్ సమ్మిట్-2026' ఒక వేదికగా నిలవనుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో వివిధ దేశాల ప్రతినిధులు, మేధావులు ఒకచోట చేరి వాటిపై చర్చించడం ద్వారా అనేక సమస్యలకు పరిష్కార మార్గాలను కనుగొనే అవకాశం కలుగుతుందన్నారు. గురువారం హెచ్ఐసీసీ నోవాటెల్ లో నిర్వహించిన 'భారత్ సమ్మిట్ - 2026' స్వాగత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ప్రస్తుతం ప్రజాస్వామ్యం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, తరతరాలుగా ప్రపంచ శాంతిని కాపాడిన అంతర్జాతీయ సంస్థల పాత్రపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో రాబోయే తరాలకు ఎలాంటి ప్రపంచాన్ని నిర్మించాలి..? అందు కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలి..? అనే అంశాలపై విస్తృత చర్చ జరగాల్సిన అవసరముందన్నారు. మేధోపరమైన చర్చలకు, ఆలోచనలకు, అంతర్జాతీయ భాగస్వామ్యాలకు తెలంగాణ ఎల్లప్పుడూ స్వాగతం పలుకుతుందన్నారు. మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ ఆలోచనల స్ఫూర్తితో సల్మాన్ ఖుర్షీద్ మార్గదర్శకత్వంలో రెండ్రోజుల పాటు వరుసగా రెండో ఏడాది కూడా భారత్ సమ్మిట్ ను హైదరాబాద్ లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. దీనికి వివిధ దేశాల నుంచి ప్రతినిధులు హాజర వుతున్నారన్నారు. ప్రజాస్వా మ్యం, ఏఐ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కొత్త రూపు, వాతావరణ మార్పులు, అంతర్జాతీయ సంస్థల సంస్కరణలు, ప్రపంచ శాంతి, మీడియా భవిష్యత్తు తదితర అంశాలపై 12 అంతర్జాతీయ ప్యానెల్ డిస్కషన్స్ ఉంటాయన్నారు. వీటితో పాటు హైటెక్స్ లో 'తెలంగాణ రైజింగ్' పేరిట 8 ప్రత్యేక చర్చా కార్యక్రమాలు జరుగుతాయ న్నారు. వీటిలో తెలంగాణ డెవలెప్ మెంట్ మోడల్, రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలపై ప్రము ఖులు తమ అభిప్రాయాలను పంచుకుంటార న్నారు. 'ఇండియా అండ్ ది వరల్డ్' పేరుతో ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామ న్నారు. శనివారం జరిగే ముగింపు కార్యక్రమా నికి కాంగ్రెస్ అగ్రనేతలు హాజరవుతారని, అదే రోజు 'అవర్ వరల్డ్ ఇన్‌స్టిట్యూట్'ను కూడా ప్రారంభించనున్నట్లుగా మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. హైదరాబాద్ ఎప్పటినుంచో విభిన్న సంస్కృతులు, సంప్రదాయాల కలయికకు వేదికగా నిలుస్తోందన్నారు. రాబోయే రెండు రోజులు ప్రపంచ దేశాల ఆలోచనలు, అభిప్రాయాల కలయికకూ వేదిక కానుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 7 నుంచి 9 వరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0'లో పాల్గొనాలని విదేశీ ప్రతినిధులను ఆహ్వానించారు. కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, సల్మాన్ ఖుర్షీద్, శశిథరూర్ తదితరులు పాల్గొన్నారు.

గిగ్ వర్కర్ల సంక్షేమానికి ప్రత్యేక చట్టం తీసుకొచ్చాం

- నవంబర్ 14నగిగ్ వర్కర్ల ర్యాలీని విజయవంతం చేయాలి
- ఆటో డ్రైవర్లకు వెల్ఫేర్ బోర్డు..
- క్యాబ్, ట్యాక్సీ, ర్యాపిడో కార్మికులకూ ప్రత్యేక చట్టం
- మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, నవంబర్ 12: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం గిగ్ వర్కర్ల సంక్షేమానికి ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నవంబర్ 14న హైదరాబాద్‌లో గిగ్ వర్కర్లతో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేపట్టనున్న ర్యాలీలో నగరవ్యాప్తంగా ఉన్న గిగ్ వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మంత్రి వివేక్ వెంకటస్వామి, ఫహీం ఖురేషితో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లుగా పెరగని ఆటో ఛార్జీలను పెట్రోల్, డీజిల్ ధరలకు అనుగుణంగా పెంచినట్లు తెలిపారు. ఆటో డ్రైవర్ల చిరకాల డిమాండ్ అయిన వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించిందని, ఇందుకు సంబంధించి చట్టబద్ధమైన చర్యలు ప్రారంభించిందని వెల్లడించారు. క్యాబ్, ట్యాక్సీ, ర్యాపిడో వంటి అగ్రిగేటర్ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి కూడా ప్రత్యేక చట్టం తీసుకురానున్నట్లు ప్రకటించారు. మహిళా సంఘాలకు రూ.10 లక్షల రుణాలుమహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. గతంలో రూ.5 లక్షలుగా ఉన్న రుణ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడంతో పాటు వడ్డీ లేని రుణాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి తమ కుటుంబాలను పోషించుకునేలా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. పేదలకు లక్ష ఇళ్ల నిర్మాణం గ్రామీణ ప్రాంతాల్లో రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని, సుమారు రెండున్నర లక్షల మంది లబ్ధిదారులు దీపావళి పండుగను కొత్త ఇళ్లలో జరుపుకున్నారని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో పేదలు, నిరుద్యోగుల కోసం లక్ష ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఎకరం రూ.100 కోట్ల విలువ చేసే ఖరీదైన ప్రాంతాల్లో సైతం పేదల కోసం ఇళ్లు నిర్మిస్తున్నామని, ఆర్టీసీ, పోలీస్ శాఖలకు చెందిన స్థలాల్లోనూ గృహ నిర్మాణాలు చేపడుతున్నామని వివరించారు. ప్రజలు పనిచేసే ప్రాంతాలకు సమీపంలోనే నివసించేలా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులుమహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు రవాణా రంగంలో పలు సంస్కరణలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. హైదరాబాద్ నగరం ఢిల్లీ తరహాలో కాలుష్య సమస్యను ఎదుర్కోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పాత ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చేందుకు రూ.200 కోట్లతో రెట్రోఫిట్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తూ సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తోందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు కియా

యూనిట్ ఓ మంచి ఉదాహరణ

- సీఎం చంద్రబాబు
- అమరావతిని బ్లూ-గ్రీన్ సిటీగా నిర్మిస్తున్నాం..
- పారిశ్రామికవేత్తలు రెండో నివాసంగా మార్చుకోవాలి
- తిరుపతిని గ్లోబల్ సెమీకండక్టర్ చిప్ డిజైన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దుతాం





హైదరాబాద్, నవంబర్ 12:
సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రత్యేక కథనంవిశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి కియా కార్ల తయారీ యూనిట్ ఓ మంచి ఉదాహ రణ అని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు అన్నారు. విశాఖప ట్నంలో జరుగుతున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలకు వేగంగా అనుమతులు మంజూరు చేయడంతోపాటు అవసరమైన భూమిని కేటాయిస్తున్నామని వివరిం చారు. ఆమ్మా డిఫెన్స్ ప్రాజెక్టుకు కేవలం 36 రోజుల్లోనే అనుమతులు ఇచ్చి భూమి కేటాయించామని, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ సంస్థ కూడా కేవలం 19 నెల్లోనే ఉత్పత్తి ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. పరిశ్రమల స్థాపనలో అనుమతుల మంజూరుకు సంబంధించి ఏపీ అనుసరిస్తున్న వేగానికి ఇవి నిదర్శనమని పేర్కొన్నారు.బ్లూ-గ్రీన్ సిటీగా అమరావతిఅమరావతి రాజధానిని బ్లూ-గ్రీన్ సిటీగా అభివృద్ధి చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ఐకానిక్ భవనాలతో ప్రపంచస్థాయి నగరంగా నిర్మిస్తున్నామని చెప్పారు. పారిశ్రామికవేత్తలు అమరావతిని తమ రెండో నివాసంగా మార్చుకోవాలని కోరారు.లాజిస్టిక్స్‌కు ఏపీ అనుకూలంరాష్ట్రంలో ప్రస్తుతం ఆరు ఆపరేషనల్ పోర్టులు, విమానాశ్రయాలు, హైస్పీడ్ రైలు నెట్‌వర్క్, మెరుగైన రోడ్డు కనెక్టివిటీ అందుబాటులో ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. ఇవన్నీ ఆంధ్రప్రదేశ్‌ను అత్యుత్తమ లాజిస్టిక్స్ హబ్‌గా నిలబెడతాయని అన్నారు.గోదావరి-కావేరీ అనుసంధానంతో జల భద్రతనదుల అనుసంధానం ద్వారా సాగు, తాగునీటితోపాటు పారిశ్రామిక అవసరాలకు కూడా నీటిని అందించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. గోదావరి కుడి, ఎడమ కాలువల ద్వారా విశాఖపట్నం, అమరావతికి నీటిని అందించడంతోపాటు కావేరీ నదీ పరీవాహక ప్రాంతానికి కూడా నీటిని తరలించే అవకాశాలున్నాయని చెప్పారు.ఎగోదావరి-కావేరీ అనుసంధానం ద్వారా ఐదు రాష్ట్రాల నీటి అవసరాలను తీర్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. దేశంలో విద్యుత్ గ్రిడ్ తరహాలో వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు.25 సెక్టోరల్ పార్కుల ఏర్పాటురాష్ట్రంలో 25 సెక్టోరల్ పార్కులను ఏర్పాటు చేస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. తిరుపతిని ప్రపంచస్థాయి సెమీకండక్టర్ చిప్ డిజైన్ కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. పారిశ్రామిక పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, జల వనరులు, సాంకేతిక రంగాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే కీలక పారిశ్రామిక, పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి వివరించారు.

ఏపీకి మేఘా మెగా పెట్టుబడులు!

- రూ.43,700 కోట్లతో నాలుగు ఒప్పందాలు..
- 1.06 లక్షల మందికి ఉపాధిమచిలీపట్నం పోర్టులో పారిశ్రామిక యూనిట్లు...
- పునరుత్పాదక విద్యుత్, గ్రీన్ పవర్, ఈవీ ఛార్జింగ్ కేంద్రాలు
- ఫిజికల్ ఇంటెలిజెన్స్ హబ్‌గా విశాఖ..
- ఎఫ్‌పబిఆర్ఐ క్యూతో ప్రత్యేక ఒప్పందం







హైదరాబాద్, నవంబర్ 12:
ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక, ఇంధన, సాంకేతిక రంగాల్లో భారీ పెట్టుబడులకు మార్గం సుగమమైంది. ప్రముఖ మౌలిక సదుపాయాల కల్పన , నిర్మాణ సంస్థ మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎం ఈ ఐ ఎల్), దాని జాయింట్ వెంచర్ సంస్థ ఎఫ్ ఏ బి ఆర్ ఐ క్యూ ప్రైవేట్ లిమిటెడ్ రాష్ట్రంలో రూ.43,700 కోట్ల పెట్టుబడులతో వివిధ ప్రాజెక్టులు చేపట్టేందుకు ఆంధ్రప్రదేశ్ అర్థికాభివృద్ధి మండలి (ఏపీఈడీబీ)తో నాలుగు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వీటి ద్వారా మొత్తం 22,940 మందికి ప్రత్యక్షంగా, 83,350 మందికి పరోక్షంగా.. మొత్తంగా 1,06,290 మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నట్లు అంచనా.విశాఖపట్నంలో జరుగుతున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు వేదికగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఎం ఈ ఐ ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పీవీ కృష్ణారెడ్డి సమక్షంలో ఈ ఒప్పందాలు జరిగాయి. మచిలీపట్నం పోర్టు వద్ద భారీ పారిశ్రామిక యూనిట్ల ఏర్పాటు, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, నిరంతర గ్రీన్ పవర్, ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ నెట్‌వర్క్‌తో పాటు అత్యాధునిక ఫిజికల్ ఇంటెలిజెన్స్, కృత్రిమ మేధ, రోబోటిక్స్ రంగాల్లో ఈ ప్రాజెక్టులు చేపట్టనున్నారు. ఈ ఒప్పందాలపై ఎం ఈ ఐ ఎల్ , ఎఫ్ ఏ బి ఆర్ ఐ క్యూ తరపున దొరయ్య(ఎం ఈ ఐ ఎల్ డైరెక్టర్), పీవీ మానస్ రెడ్డి(జనరల్ మేనేజర్), శ్రీధర్ గద్దె (సి ఈ ఓ , సోలార్ విభాగం), శ్రీనివాస్ రెడ్డి సుంకర (ఎఫ్ ఏ బి ఆర్ ఐ క్యూ, సి ఈ ఓ) సంతకాలు చేశారు. సి ఎం నారా చంద్రబాబు నాయుడు , మంత్రి నారా లోకేష్ సమక్షంలో వారు ఏపీఈడీబీ అధికారులు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు.ఎం ఈ ఐ ఎల్ ప్రతిపాదించిన మూడు పెట్టుబడి ఒప్పందాల విలువ రూ.39,400 కోట్లు కాగా.. ఎఫ్ ఏ బి ఆర్ ఐ క్యూతో కుదిరిన ప్రత్యేక సాంకేతిక భాగస్వామ్య ప్రతిపాదన విలువ రూ.4,300 కోట్లు. ఈ నాలుగు ఒప్పందాలు రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి, కొత్త సాంకేతిక పరిజ్ఞానాల విస్తరణకు ఊత మివ్వనున్నాయి. మచిలీపట్నం పోర్టు వద్ద రూ.2,300 కోట్లతో ట్యాంక్ ఫామ్1,500 మందికి ప్రత్యక్షం.. 4,500 మందికి పరోక్ష ఉపాధికృష్ణా జిల్లాలోని మచిలీపట్నం పోర్టు వద్ద రూ.2,300 కోట్లతో స్టోరేజ్ ట్యాంక్ ఫామ్ ఏర్పాటు చేయాలని ఎం ఈ ఐ ఎల్ ప్రతిపాదించింది. సుమారు 150 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నారు. పోర్టు ఆధారిత పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలకు అవసరమైన నిల్వ, నిర్వహణ మౌలిక సదుపాయాలను ఈ కేంద్రం అందించనుంది. దీనివల్ల 1,500 మందికి ప్రత్యక్షంగా, 4,500 మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది. రూ.1,100 కోట్లతో ప్రాసెస్ ఎక్విప్‌మెంట్ తయారీ కేంద్రం2,500 మందికి ప్రత్యక్షం.. 6,500 మందికి పరోక్షంగా ఉద్యోగాలుమచిలీపట్నం పోర్టు వద్దే రూ.1,100 కోట్ల పెట్టుబడితో ప్రాసెస్ ఎక్విప్‌మెంట్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. సుమారు 250 ఎకరాల్లో నిర్మించనున్న ఈ పరిశ్రమ ద్వారా వివిధ పారిశ్రామిక రంగాలకు అవసరమైన పరికరాలను తయారు చేయనున్నారు. 2030 డిసెంబరు నాటికి 2,500 మందికి ప్రత్యక్షంగా, మరో 6,500 మందికి పరోక్షంగా ఉపాధి కల్పించే అవకాశం ఉంది. ఈ ఒప్పందంపై ఏపీఈడీబీ సీఈవో షాన్ మోహన్ సాగిలి, ఎం ఈ ఐ ఎల్ హైడ్రోకార్బన్స్ డైరెక్టర్ దొరయ్య సంతకాలు చేశారు. రూ.36 వేల కోట్లతో గ్రీన్ ఎనర్జీ, ఈవీ ప్రాజెక్టులుమూడు ప్రాజెక్టులతో 8,940 మందికి ప్రత్యక్షం.. 22,350 మందికి పరోక్ష ఉపాధిపునరుత్పాదక విద్యుత్, నిరంతర గ్రీన్ పవర్, ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ మౌలిక సదుపాయాల కల్పనకు ఎం ఈ ఐ ఎల్ రూ.36 వేల కోట్ల పెట్టుబడితో మూడు ప్రాజెక్టులను ప్రతిపాదించింది. వీటి ద్వారా 8,940 మందికి ప్రత్యక్షంగా, 22,350 మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. రూ.12 వేల కోట్లతో 3 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టు1,500 మందికి ప్రత్యక్షం.. 3,750 మందికి పరోక్ష ఉపాధిఅనంతపురం, కర్నూలు జిల్లాలతో పాటు పరిసర ప్రాంతాల్లో సుమారు 6,800 ఎకరాల్లో 3 గిగావాట్ల సామర్థ్యంతో పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రూ.12 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 1,500 మందికి ప్రత్యక్షంగా, 3,750 మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది. రాష్ట్రంలో స్వచ్ఛమైన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ఇది దోహదపడనుంది. రూ.18 వేల కోట్లతో 1 గిగావాట్ నిరంతర గ్రీన్ పవర్1,440 మందికి ప్రత్యక్షం.. 3,600 మందికి పరోక్ష ఉపాధిడేటా సెంటర్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 1 గిగావాట్ సామర్థ్యంతో రౌండ్ ది క్లాక్ (ఆర్టీసీ) గ్రీన్ పవర్ ప్రాజెక్టును చేపట్టనున్నారు. సుమారు 5,698 ఎకరాల్లో రూ.18 వేల కోట్ల పెట్టుబడితో దీన్ని అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. నిరంతరాయంగా స్వచ్ఛమైన విద్యుత్‌ను అందించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. దీనివల్ల 1,440 మందికి ప్రత్యక్షంగా, 3,600 మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది. రూ.6 వేల కోట్లతో 1,500 ఈవీ ఛార్జింగ్ కేంద్రాలు6 వేల మందికి ప్రత్యక్షం.. 15 వేల మందికి పరోక్ష ఉపాధిరాష్ట్ర వ్యాప్తంగా 1,500 ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎం ఈ ఐ ఎల్ ప్రతిపాదించింది. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజ యవాడ, నెల్లూరు, తిరుపతి నగరాల్లో ఈ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం రూ.6 వేల కోట్లు వెచ్చించను న్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 6 వేల మందికి ప్రత్యక్షంగా, 15 వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఛార్జింగ్ సదుపాయాల విస్తరణకు ఈ ప్రాజెక్టు దోహదం చేయ నుంది. రూ.4,300 కోట్లతో ఫిజికల్ ఇంటెలిజెన్స్ హబ్ఎఫ్ ఏ బి ఆర్ ఐ క్యూతో ఏపీఈడీబీ ఒప్పందం.. 10 వేల మందికి ప్రత్యక్షం, 50 వేల మందికి పరోక్ష ఉపాధి అంచనాకృత్రిమ మేధ (ఏఐ), రోబోటిక్స్, స్వయంచాలక వ్యవస్థలు, ఫిజికల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతల్లో ఆంధ్రప్రదేశ్‌ను కీలక కేంద్రంగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ దిశగా ఎం ఈ ఐ ఎల్ , యూఏఈకి చెందిన అనలాగ్ సంస్థల 50:50 జాయింట్ వెంచర్ అయిన ఎఫ్ ఏ బి ఆర్ ఐ క్యూ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఏపీఈడీబీ ప్రత్యేక ఒప్పందం కుదుర్చుకుంది. ఐదు ప్రధాన రంగాల్లో రూ.4,300 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనతో చేపట్టనున్న ఈ కార్యక్రమం ద్వారా 10 వేల మందికి ప్రత్యక్షంగా, 50 వేల మందికి పరోక్షంగా ఉపాధి కల్పించే అవకాశముందని అంచనా.ఐదు రంగాల్లో సాంకేతిక కేంద్రాలుఫిజికల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్ సెంటర్ ఏర్పాటు ఈ కార్యక్రమంలో కీలకమైనది. విశాఖపట్నం లేదా అమరావతిలో దీన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పరిశోధన, సాంకేతిక అభివృద్ధి, ఇంజినీరింగ్, ఆవిష్కరణలు, అధునాతన పరిజ్ఞాన వినియోగానికి ఇది కేంద్రంగా ఉండనుంది.స్మార్ట్ సిటీలు, ట్రాఫిక్, పట్టణ నిర్వహణలోనూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నారు. విశాఖలో తొలుత ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ పైలట్ ప్రాజెక్టును చేపట్టాలని ప్రతిపాదించారు. రహదారులపై వాహనాల రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం, ట్రాఫిక్ సమస్యలను ముందుగానే అంచనా వేయడం, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడం, ప్రమాదాలు జరిగినప్పుడు స్పందనను వేగవంతం చేయడం వంటి అంశాలకు ఈ వ్యవస్థ ఉపయోగపడనుంది.రోబోటిక్స్, స్వయంచాలక వ్యవస్థల రంగంలో పరిశ్రమలు, మౌలిక సదుపాయాల నిర్వహణకు అవసరమైన పరిష్కారాలను అభివృద్ధి చేయనున్నారు. పారిశ్రామిక తనిఖీలు, సరకు రవాణా, నిర్వహణ పనుల్లో రోబోట్ల వినియోగాన్ని ప్రోత్సహించనున్నారు. అలాగే పారిశ్రామిక రంగంలో కృత్రిమ మేధ ఆధారిత ఆటోమేషన్, యంత్రాల పనితీరు ముందస్తు అంచనా, స్మార్ట్ తయారీ విధానాలను ప్రవేశపెట్టనున్నారు.ఐదో రంగంలో ఏఐ, రోబోటిక్స్, స్వయంచాలక సాంకేతికతలపై పరిశోధన, అభివృద్ధితో పాటు ప్రత్యేక నైపుణ్య శిక్షణకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. తద్వారా ఈ రంగాల్లో నిపుణులైన యువతను తయారు చేయడంతో పాటు స్టార్టప్‌లు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అవకాశాలు కల్పించనున్నారు.డిజిటల్ ట్విన్స్.. ఏఐ ఆధారిత సేవలు నగరాలు, పారిశ్రామిక కారిడార్లు, పోర్టులు, కీలక మౌలిక సదుపాయాలకు సంబంధించిన డిజిటల్ నమూనాలను రూపొందించే డిజిటల్ ట్విన్ సాంకేతికతను కూడా వినియోగించనున్నారు. దీనివల్ల వివిధ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి ప్రణాళికలు రూపొందించడానికి, నిర్వహణ నిర్ణయాలు తీసుకోవడానికి వీలవుతుంది. స్మార్ట్ విద్యుత్ నిర్వహణ, రవాణా, నీటి సరఫరా, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పర్యవేక్షణ, పారిశ్రామిక భద్రత రంగాల్లోనూ ఏఐ ఆధారిత పరిష్కారాలను అభివృద్ధి చేయనున్నారు.అనలాగ్ సంస్థ అభివృద్ధి చేసిన అనలాగ్ వరల్డ్ మోడల్, అనలాగ్ హైవ్, అనలాగ్ రోబోటిక్స్, అన వంటి సాంకేతిక వేదికలను ఈ కార్యక్రమంలో వినియోగించుకోనున్నారు. భౌతిక ప్రపంచాన్ని అర్థం చేసుకుని, దానికి అనుగుణంగా స్పందించే తెలివైన వ్యవస్థల అభివృద్ధి ఈ భాగస్వామ్యం ప్రధాన ఉద్దేశం.పెట్టుబడుల కల్పనకు ఏపీఈడీబీ సహకారంఈ ఒప్పందం ప్రకారం సాంకేతిక పరిజ్ఞానం, ప్రణాళిక, రూపకల్పన, పరికరాల సమీకరణ, పెట్టుబడుల సమీకరణలో ఎఫ్ ఏ బి ఆర్ ఐ క్యూ తన వంతు సహకారం అందించనుంది. సంబంధిత ప్రభుత్వ విభాగాలు, అవసరమైన సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవడంలో ఏపీఈడీబీ సహకరిస్తుంది.

పేదలకు ప్రభుత్వ చేయూత..

8,209 మందికి కొత్త పింఛన్లు..



- ఈ నెల 19 నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ
- జిల్లాలో 1.21 లక్షల మందికి నెలకు రూ.25.97 కోట్ల పింఛన్లు
- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

బలగం టీవీ,వేములవాడ:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. గురు వారం వేములవాడ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి చేయూత నూతన పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత తెలంగాణ గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించి, అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లాలో కొత్తగా 8,209 పింఛన్లు మంజూరు చేసామని, ఇప్పటికే 1,13,264 మందికి పింఛన్లు అందుతుండగా, కొత్తగా మంజూరైన వాటితో కలిపి మొత్తం 1,21,473 మందికి ప్రతి నెలా పింఛన్లు అందనున్నాయని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం నెలకు సుమారు రూ.25.97 కోట్లు ఖర్చు చేయనుందని వివరించారు. ఈ నెల 19 నుంచి కొత్త పింఛన్ల నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ కానుందని చెప్పారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలతో పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, మరోవైపు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నామని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, తలసేమియా, సికిల్ సెల్, హీమోఫీలియా బాధితులు, గీత, నేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితుల నుంచి ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి అర్హులను ఎంపిక చేశామన్నారు. ఈ నెల 18వ తేదీలోగా మంజూరు పత్రాల పంపిణీ పూర్తి చేస్తామని, 19వ తేదీ నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని అన్నారు .

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఉచిత బస్సు ప్రయాణంతో పాటు మహిళల పేరిట ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని, మహిళా సంఘాలకు విద్యార్థుల ఏకరూప దుస్తుల కుట్టు బాధ్యతలు అప్పగించామని, వయోవృద్ధుల సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకొచ్చిందని, త్వరలో అమల్లోకి రానుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్లు రొండి రాజు, చెలుకల తిరుపతి, కచ్చకాయల ఎల్లయ్య, సహకార సంఘాల అధ్యక్షులు, ఆర్డీఓ కేవీఎన్‌బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల సేవలు వినియోగించుకోవాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ,తంగళ్లపల్లి,

అంగన్వాడీ కేంద్రాల సేవలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. తంగళ్లపల్లి మండలం పద్మనగర్ అంగన్వాడీ కేంద్ర నిర్మాణ పనులు పూర్తికాగా, గురువారం జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై భవనాన్ని ప్రారంభించారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతి రోజూ తల్లిదండ్రులు బాధ్యతగా తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా పంపాలని సూచించారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఇప్పటి నుంచే సరైన పోషకాహారం అందించాలని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు నిత్యం పంపించడంతో పిల్లలకు పోషకాహారం అందుతుందని, ఆట, పాటలు బొమ్మల ద్వారా విద్య బుద్ధులు చెపుతారని వివరించారు. అంగన్వాడి కేంద్రాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారని కొనియాడారు..

సామ్, మామ్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. తీవ్రమైన పోషకాహార లోపం, మధ్యస్థ తీవ్ర పోషకాహార లోపం, తీవ్రమైన తక్కువ బరువు, మధ్యస్థ తక్కువ బరువు ఉన్న పిల్లలకు ప్రత్యేక శ్రద్ధ పెట్టి.. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందిస్తారని వివరించారు. వారికి బాలామృతం ప్లస్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు.ప్రతి మంగళవారం 10 నిమిషాలు కార్యక్రమాన్ని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు.



కేంద్రాల సేవలు, వసతులు మెరుగు పరచడం, పోషకాహారం పంపిణీ, బాలల హక్కుల రక్షణ, వసతుల పెంపు తదితర అంశాలపై కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొనాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, ఇంచార్జి తహసీల్దార్ మురళి, ఎంపీడీఓ రమేష్, సర్పంచ్ మోర నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పీసీపీఎన్‌డీటీ చట్టం అమలులో నిర్లక్ష్యం వద్దు



- లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే కఠిన చర్యలు
- డీఎంహెచ్వో డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలను పూర్తిగా అరికట్టేందుకు పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి పీసీపీఎన్‌డీటీ సలహా కమిటీ సమావేశానికి డిఎంహెచ్వో డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల నిర్వహణ, చట్ట నిబంధనల అమలు తీరుపై సమీక్షించారు. ఒక నూతన స్కానింగ్ కేంద్రం నమోదుకు కమిటీ ఆమోదం తెలిపింది. పీసీపీఎన్‌డీటీ విభాగం పనుల సౌలభ్యం కోసం కంప్యూటర్, ప్రింటర్ కొనుగోలుకు నిర్ణయించింది.ఈ సందర్భంగా డిఎంహెచ్వో డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ మాట్లాడుతూ గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని, పాల్పడిన వారికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. అన్ని స్కానింగ్ కేంద్రాల్లో చట్టానికి సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లు, పత్రాలను సక్రమంగా నిర్వహించాలని, చట్ట ప్రతులు, నమోదు ధ్రువీకరణ పత్రం, పరీక్షల ధరలు, వైద్యుల పేర్లు, అర్హతల వివరాలను ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు.

అనంతరం నిర్వహించిన మాతృ మరణాల సమీక్ష సమావేశంలో నెరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నమోదైన ఒక మాతృ మరణ కేసును కమిటీ సమగ్రంగా పరిశీలించింది. గర్భిణీలను తొలిదశలోనే గుర్తించి నమోదు చేయాలని, అధిక ప్రమాద గర్భిణీలను ముందుగానే గుర్తించి ప్రత్యేక వైద్య పర్యవేక్షణ అందించాలని సూచించారు. వైద్యుల సలహా మేరకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు క్రమం తప్పకుండా వినియోగించేలా అవగాహన కల్పించాలన్నారు.గర్భిణీలకు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించడం, రక్తహీనతను నివారించడం, ప్రమాదకర లక్షణాలను ముందుగానే గుర్తించి మెరుగైన వైద్యం అందించడం ద్వారా మాతృ మరణాలను తగ్గించవచ్చని కమిటీ అభిప్రాయపడింది.

ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ, కార్యక్రమ అధికారి నాగేంద్రబాబు, డాక్టర్ ఎం. సుగుణ, డాక్టర్ సంగీతారెడ్డి, డాక్టర్ పరమేశ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజినీకాంత్, ఐఎంఏ ప్రతినిధి డాక్టర్ సీహెచ్. సంతోష్, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సీహెచ్. భాస్కర్, జిల్లా ఉప ప్రజాసంబంధాల అధికారి ప్రసాద్, వైద్యాధికారి చంద్రిక తదితరులు పాల్గొన్నారు.



ఐఆర్‌సీఎస్ సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేయాలి..

- ఇండియన్ రెడ్ క్రాస్ ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐ ఆర్ సీ ఎస్) మేనేజింగ్ కమిటీ జిల్లాలో సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేయాలని ఇండియన్ రెడ్ క్రాస్ ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, పిలుపునిచ్చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులతో ఇండియన్ రెడ్ క్రాస్ ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని గురువారం సమావేశం నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఐ ఆర్ సీ ఎస్ సభ్యులు జిల్లాలో ఒక ప్రణాళిక ప్రకారం సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఐ ఆర్ సీ ఎస్ కార్యాలయం, నూతన్ బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు, సభ్యత్వ నమోదు తదితర కార్యక్రమాలను పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఐ ఆర్ సీ ఎస్ జిల్లా చైర్మన్ గూడూరి రవీందర్, వైస్ చైర్మన్ ప్రయాకరావు వేణు కుమార్, సెక్రటరీ సీ హెచ్ సంతోష్ కుమార్, సలహాదారు ఈవీ శ్రీనివాస్ రావు, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడు పీవీ సంజీవ రెడ్డి, కోశాధికారి చంద్రగిరి శ్రీధర్, మేనేజింగ్ కమిటీ సభ్యులు ఎం. అజయ్ బాబు, ఏ శివప్రసాద్ కే బాబు, సీహెచ్ శ్రీనివాస్, దేవదాస్, అరుణ,రాజు, సురేంద్ర బాబు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కళాకారులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాజ్ బోడపై చర్యలు తీసుకోవాలి..

- సిరిసిల్ల పోలీసులకు తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఫోక్ అసోసియేషన్ ఫిర్యాదు
- మహిళా కళాకారులకు అండగా ఉంటాం.. బహిరంగ క్షమాపణ చెప్పాలి

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

తెలంగాణ జానపద కళాకారులు, ముఖ్యంగా మహిళా కళాకారులపై అమెరికాలో నివాసం ఉంటున్న ఎన్ఆర్ఐ రజనీకాంత్ బోడ అలియాస్ రాజ్ బోడ సామాజిక మాధ్యమాల్లో చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ తెలుగ ఫోక్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందజేశారు. అనంతరం సిరిసిల్ల ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ

రాజకీయ నాయకులపై విమర్శలు చేయడం వ్యక్తిగత విషయమైనప్పటికీ, కళాకారుల వృత్తిని, వారి కళా ప్రదర్శనలను ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదన్నారు. ముఖ్యంగా తెలంగాణ ఆడబిడ్డలైన మధుప్రియ, శివజ్యోతిపై చేసిన వ్యాఖ్యలు మహిళా లోకాన్ని అవమానించేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కళాకారులు ఏ రాజకీయ పార్టీకి, సంఘానికి లేదా సంస్థకు చెందిన కార్యక్రమాల్లోనైనా తమ కళలను ప్రదర్శించుకునే స్వేచ్ఛ ఉందని స్పష్టం చేశారు. రాజ్ బోడ వెంటనే మహిళా కళాకారులకు బహిరంగ క్షమాపణ చెప్పి, సంబంధిత వీడియోను తొలగించాలని డిమాండ్ చేశారు. సామాజిక మాధ్యమాల నిర్వాహకులు సైతం ఆయన ఖాతాపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే జానపద కళాకారుల సంఘం తరపున తీవ్రంగా స్పందిస్తామని హెచ్చరించారు. మధుప్రియ, శివజ్యోతితో పాటు ఇతర మహిళా కళాకారులకు తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ అండగా ఉంటుందని, వారు ధైర్యంగా తమ కళా ప్రదర్శనలు కొనసాగించాలని భరోసా ఇచ్చారు.ఇక్కడ తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సత్తార్. ఆకునూరి దేవయ్య విశ్వరాజ్ మహేష్ సాంబారి నవీన్. కాయితోజి ప్రవీణ్. నక్క శ్రీకాంత్. వేముల సతీష్. శ్రీరామ్ మహేందర్. పులి శ్రీనివాస్. సాంబారి రాజు. తదితరులు పాల్గొన్నారు



మంథని ఏఎంసీలో రైతులను ఆగం చేస్తున్నారు

- ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వం
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఫైర్!
- మంథని మార్కెట్ యార్డులో పేరుకు-పోయిన ధాన్యం రాశులను పరిశీలిం-చిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్

బలగం టీవీ, మంథని

పెద్దపల్లి జిల్లా మంథని వ్యవసాయ మార్కెట్ కమిటీ (AMC) లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ ఆగం చేస్తున్నదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గురువారం (నవంబర్ 12) ఆయన మంథని ఏఎంసీ యార్డును సందర్శించి, అక్కడ అమ్మకానికి సిద్ధంగా ఉండి పేరుకుపోయిన ధాన్యం కుప్పలను పరిశీలించారు.

ఈ సందర్భంగా పుట్ట మధుకర్ విలేకరులతో మాట్లాడుతూ.. ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులు రూ. 3,000 వరకు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారని ముఖ్యమంత్రి మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మంథని మార్కెట్లో కనీసం రూ. 2,500లకు కూడా ధాన్యాన్ని కొనుగోలు చేసే నాథుడు లేడనడానికి ఏఎంసీలో పడి ఉన్న ధాన్యం రాశులే నిదర్శనమని అన్నారు. కొనుగోళ్లు జరగకపోవడంతో కష్టపడి పండించిన ధాన్యం కుప్పలు కొంగలకు, పక్షులకు ఆహారంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే స్వయంగా దళారులను ప్రోత్సహిస్తూ రైతులను నట్టేట ముంచాలని చూస్తోందని ఆరోపించారు.

స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు తీరుపై పుట్ట మధుకర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రికి భజన చేయడం మాని, ప్రజలను, రైతులను చులకన చేసి చూడటం కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే బంద్ చేయాలన్నారు. ఓవైపు తరుగు పేరిట కోతలతో దోపిడీ చేస్తూ, మరోవైపు దళారులను రైతుల మీదకు వదులుతున్నారని దుయ్యబట్టారు. మంథని నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా విస్మరించి అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, రైతులకు పూర్తిస్థాయి మద్దతు ధర కల్పించాలని పుట్ట మధుకర్ డిమాండ్ చేశారు.



రష్యా నుంచి భారత్ చమురు దిగుమతుల్లో సరికొత్త రికార్డు

- అక్టోబర్‌లో 6.4 బిలియన్ల కొనుగోళ్లో!
- పశ్చిమాసియా యుద్ధంతో అంతర్జాతీయంగా పెరిగిన ఇంధన ధరల నేపథ్యంలో రష్యా నుంచి పెరిగిన దిగుమతులు
- మొత్తం కొనుగోళ్లలో 91 శాతం (5.8 బిలియన్లు) వాటా క్రూడ్ ఆయిల్‌దే; రెండో అతిపెద్ద కొనుగోలుదారుగా భారత్
- సముద్ర మార్గంలో రష్యా ముడి చమురు దిగుమతుల్లో మళ్లీ అగ్రస్థానంలో నిలిచిన రిలయన్స్ జామ్‌నగర్ రిఫైనరీ

బలగం టీవీ, జాతీయ/బిజినెస్ విభాగం:

పశ్చిమాసియా యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో, రష్యా నుంచి భారత్ చేసుకునే శిలాజ ఇంధన (Fossil Fuel) దిగుమతులు అక్టోబర్ 2026లో ఆల్-టైమ్ రికార్డు స్థాయికి చేరుకున్నాయి. అక్టోబర్ నెలలో భారత్ రష్యా నుంచి ఏకంగా 6.4 బిలియన్ యూరోల (EUR 6.4 bn) విలువైన హైడ్రోకార్బన్లను దిగుమతి చేసుకుందని యూరప్‌కు చెందిన ప్రముఖ పరిశోధనా సంస్థ 'సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్' (CREA) గురువారం (నవంబర్ 12) విడుదల చేసిన విశ్లేషణలో వెల్లడించింది.

జనవరి 2022 నుంచి అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం.. ఒకే నెలలో భారత్ చేసిన అత్యధిక కొనుగోళ్లు ఇవే కావడం విశేషం. రష్యా ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్న దేశాల్లో చైనా (10.7 బిలియన్ యూరోలు) అగ్రస్థానంలో ఉండగా, భారత్ రెండో అతిపెద్ద కొనుగోలుదారుగా నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో యూరోపియన్ యూనియన్ (EU), టర్కీ ఉన్నాయి.

భారత్ దిగుమతుల వివరాలు (అక్టోబర్ 2026):

ముడి చమురు (Crude Oil): మొత్తం దిగుమతుల్లో 91 శాతం వాటా క్రూడ్ ఆయిల్‌దే ఉంది. దీని విలువ 5.8 బిలియన్ యూరోలు.

బొగ్గు (Coal): 333 మిలియన్ యూరోలు.

చమురు ఉత్పత్తులు (Oil Products): 232 మిలియన్ యూరోలు (భారత్ రష్యా నుంచి ఎల్ఎన్‌జీని మాత్రం దిగుమతి చేసుకోవడం లేదు).

మూడు ప్రధాన రిఫైనరీల్లో పెరిగిన దిగుమతులు:

సెప్టెంబర్‌తో పోలిస్తే అక్టోబర్‌లో రష్యా క్రూడ్ ఆయిల్ దిగుమతులు 10 శాతం పెరిగాయి. దేశంలోని మూడు ప్రధాన రిఫైనరీల్లోనూ దిగుమతులు గణనీయంగా పెరిగినట్లు CREA తెలిపింది:

పారాదీప్ రిఫైనరీ (IOCL): గత నెలతో పోలిస్తే 28 శాతం పెరుగుదల.

జామ్‌నగర్ రిఫైనరీ (రిలయన్స్ ఇండస్ట్రీస్): 22 శాతం పెరుగుదలతో సముద్ర మార్గంలో రష్యా క్రూడ్ ఆయిల్ దిగుమతి చేసుకునే ప్రపంచంలోనే అతిపెద్ద రిఫైనరీగా జామ్‌నగర్ మళ్లీ నిలిచింది.

వాడినార్ రిఫైనరీ (నయారా ఎనర్జీ): 12 శాతం పెరుగుదల నమోదైంది.

రష్యాకు భారీ ఆదాయం:

అంతర్జాతీయంగా యుద్ధాల వల్ల రష్యా ప్రధాన క్రూడ్ 'ఉరల్స్' (Urals) సగటు ధర అక్టోబర్‌లో 13 శాతం పెరిగి బ్యారెల్‌కు 101.7 డాలర్లకు చేరుకుంది. అక్టోబర్ 2021 తర్వాత ఇదే అత్యధిక ధర. దీనివల్ల రష్యా రోజువారీ ఇంధన ఎగుమతి ఆదాయం 14 శాతం పెరిగి 754 మిలియన్ యూరోలకు చేరుకుంది. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు మొదలైన గత ఆరు నెలల్లో పెరిగిన చమురు, గ్యాస్ ధరల వల్ల రష్యాకు అదనంగా 35.9 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరిందని CREA అంచనా వేసింది.

ఫిబ్రవరి 2023 నుంచి అక్టోబర్ 2026 మధ్య కాలంలో రష్యా ఎగుమతి చేసిన మొత్తం క్రూడ్ ఆయిల్‌లో చైనా 50 శాతం, భారత్ 37 శాతం కొనుగోలు చేశాయి. అదేవిధంగా రష్యా బొగ్గు ఎగుమతుల్లో చైనా 37 శాతం, భారత్ 20 శాతం వాటాను కలిగి ఉన్నాయి.

లండన్‌లో ఇరాన్ గూఢచారుల గుట్టురట్టు

- జర్నలిస్టులపై నిఘా పెట్టిన ఇద్దరు ఇరాన్ జాతీయులు దోషులుగా నిర్ధారణ!
- ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (IRGC) కు సహకరించిన కేసులో ముస్తఫా సెపాహ్‌వంద్, ఫర్హాద్ జవాదీ మనేష్‌లను దోషులుగా తేల్చిన వూల్‌విచ్ క్రౌన్ కోర్టు

బలగం టీవీ, అంతర్జాతీయ విభాగం:

బ్రిటన్ రాజధాని లండన్‌లో ఉంటూ ఇరాన్ కోసం గూఢచర్యం (Spying) నిర్వహిస్తున్న ఇద్దరు ఇరాన్ జాతీయులను లండన్ కోర్టు దోషులుగా నిర్ధారించింది. లండన్‌లోని పర్షియన్ భాషా వార్తా సంస్థ 'ఇరాన్ ఇంటర్నేషనల్' (Iran International) జర్నలిస్టులపై నిఘా పెట్టిన కేసులో ముస్తఫా సెపాహ్‌వంద్ (41), ఫర్హాద్ జవాదీ మనేష్ (46) లను దోషులుగా తేలుస్తూ దక్షిణ లండన్‌లోని వూల్‌విచ్ క్రౌన్ కోర్టు గురువారం (నవంబర్ 12) తీర్పు వెలువరించింది.

ఆరు వారాల పాటు జరిగిన విచారణ అనంతరం.. నిషేధిత ఇరాన్ సైనిక విభాగం 'ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్' (IRGC) కు సహకరించే చర్యలకు పాల్పడ్డారన్న అభియోగాలు వీరిపై రుజువయ్యాయి. కాగా, ఈ కేసులో మూడో నిందితుడిగా ఉన్న షాపూర్ ఖలేహాలీ ఖానీ నూరి (57) ని అన్ని ఆరోపణల నుంచి కోర్టు నిర్దోషిగా విడుదల చేసింది.

టార్గెట్‌పై రెక్కీ.. చాట్‌జీపీటీ (ChatGPT) తో వివరాలు:

ఇరాన్ ప్రభుత్వాన్ని విమర్శించే వారిని లక్ష్యంగా చేసుకుని ఈ గూఢచర్య ఆపరేషన్ నిర్వహించారని క్రౌన్ ప్రాసిక్యూషన్ సర్వీస్ చీఫ్ ప్రాసిక్యూటర్ ఫ్రాంక్ ఫెర్గూసన్ తెలిపారు.

ఇరాన్ ఇంటర్నేషనల్ జర్నలిస్టులు మొజ్తబా పౌర్మోహ్సేనీలతో పాటు 'యూకే లాయర్స్ ఫర్ ఇజ్రాయెల్' వ్యవస్థాపక సభ్యుడు జోనాథన్ టర్నర్‌ల నివాస ప్రాంతాలకు నిందితులు వెళ్లి ఫోటోలు, వీడియోలు తీశారు.

లక్ష్యంగా ఎంచుకున్న వ్యక్తుల వివరాలను ఆన్‌లైన్‌లో సేకరించడానికి చాట్‌జీపీటీ (ChatGPT) వంటి ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించారు.

సమాచారాన్ని ఇరాన్‌కు పంపినందుకు వీరికి భారీ బహుమతులు ఇస్తామని హామీ లభించిందని, అంతేకాదు సెపాహ్‌వంద్ నిఘాతో ఆగకుండా వారిపై తీవ్రమైన దాడులకు కూడా సిద్ధపడ్డాడని ప్రాసిక్యూషన్ పేర్కొంది. అయితే ఏదైనా దాడి జరగకముందే నిందితులను అదుపులోకి తీసుకోవడంతో పెను ప్రమాదం తప్పింది.

డిసెంబర్ 17న శిక్ష ఖరారు:

యూకే ప్రభుత్వం గత జూలైలో ఐఆర్‌జీసీ (IRGC) ని నిషేధించింది. ఆ సంస్థకు మద్దతు ఇచ్చినా లేదా సహకరించినా గరిష్టంగా 14 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించేలా కొత్త చట్టాలను తీసుకువచ్చింది. దోషులుగా తేలిన సెపాహ్‌వంద్, మనేష్‌లకు డిసెంబర్ 17న లండన్‌లోని సెంట్రల్ క్రిమినల్ కోర్టు (ఓల్డ్ బెయిలీ) శిక్షను ఖరారు చేయనుంది.

మరోవైపు, యూకేలో హింసాత్మక కార్యకలాపాలు లేదా గూఢచర్యంతో తమకు ఎలాంటి సంబంధం లేదని లండన్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం ఈ ఆరోపణలను ఖండించింది. అయితే శత్రు దేశాల నుంచి బ్రిటన్‌కు ముప్పు పెరుగుతోందని, స్థానికంగా స్థిరపడిన వారిని ఇరాన్ తన ఏజెంట్లుగా వాడుకుంటోందని లండన్ మెట్రోపాలిటన్ పోలీస్ ఉన్నతాధికారిణి విక్కీ ఎవాన్స్ ఆందోళన వ్యక్తం చేశారు.

ఆఫ్ఘనిస్తాన్‌లో రష్యా ఉన్నత స్థాయి బృందం పర్యటన

- వాణిజ్యం, పెట్టుబడులపై తాలిబన్లతో కీలక చర్చలు!
- రష్యా ఉప ప్రధానమంత్రి అలెక్సీ ఓవర్‌చుక్ నేతృత్వంలో 70 మందికి పైగా పారిశ్రామికవేత్తలతో కాబూల్ చేరుకున్న బృందం

బలగం టీవీ, అంతర్జాతీయ విభాగం:

గనులు, మౌలిక సదుపాయాలు, ప్రత్యేక ఆర్థిక మండలాల్లో పెట్టుబడులు పెట్టాలని రష్యా కంపెనీలను ఆహ్వానించిన తాలిబన్ ప్రభుత్వం

ఆఫ్ఘనిస్తాన్‌లో నేరుగా ఎరువుల తయారీ ప్లాంట్ల ఏర్పాటుకు మాస్కో సుముఖతబలగం టీవీ, అంతర్జాతీయ విభాగం:

కాబూల్ (ఆఫ్ఘనిస్తాన్):

ఆఫ్ఘనిస్తాన్‌తో వాణిజ్య, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా రష్యా కీలక అడుగు వేసింది. రష్యా ఉప ప్రధానమంత్రి అలెక్సీ ఓవర్‌చుక్ (Alexei Overchuk) నేతృత్వంలోని ఉన్నత స్థాయి బృందం గురువారం (నవంబర్ 12) ఆఫ్ఘనిస్తాన్ రాజధాని కాబూల్‌కు చేరుకుంది. తాలిబన్ ప్రభుత్వంతో వాణిజ్యం, పెట్టుబడుల అంశాలపై ఈ బృందం విస్తృత స్థాయి చర్చలు జరిపింది.

2021 ఆగస్టులో ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్లు అధికారంలోకి వచ్చిన తర్వాత, జూలై 2025లో వారి ప్రభుత్వానికి అధికారిక గుర్తింపు ఇచ్చిన ఏకైక దేశంగా రష్యా నిలిచింది. అంతర్జాతీయంగా ఒంటరితనాన్ని, తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కాబూల్‌కు రష్యా పర్యటన పెద్ద ఊరటగా మారింది.

ఖనిజాలు, మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులకు తాలిబన్ల ఆహ్వానం:

కాబూల్ విమానాశ్రయంలో ఓవర్‌చుక్‌కు గౌరవ వందనం సమర్పించిన అనంతరం, ఆయన ఆఫ్ఘన్ ప్రధానమంత్రి మహ్మద్ హసన్ అఖుంద్ మరియు ఆర్థిక వ్యవహారాల ఉప ప్రధానమంత్రి అబ్దుల్ ఘనీ బరాదర్‌లతో భేటీ అయ్యారు.

ఆఫ్ఘనిస్తాన్‌కు ఉన్న వ్యూహాత్మక భౌగోళిక స్థానం, అపారమైన సహజ వనరులు మరియు పనిచేయగల వయసున్న 2.4 కోట్ల మంది కార్మిక శక్తిని అబ్దుల్ ఘనీ బరాదర్ రష్యా బృందానికి వివరించారు.

ఖనిజాల వెలికితీత (Mineral extraction), కర్మాగారాల స్థాపన, మౌలిక సదుపాయాల కల్పన మరియు ప్రత్యేక ఆర్థిక మండలాల్లో (SEZs) పెట్టుబడులు పెట్టాలని రష్యా కంపెనీలను ఆయన ఆహ్వానించారు.

ఆఫ్ఘన్ వ్యవసాయ ఉత్పత్తులను రష్యాకు ఎగుమతి చేయడంతో పాటు, వ్యవసాయం మరియు పశుపోషణ రంగాల్లో రష్యా పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని తాలిబన్ ప్రభుత్వం పేర్కొంది.

ఆఫ్ఘనిస్తాన్‌లోనే ఎరువుల కర్మాగారాలు – రష్యా డిప్యూటీ పీఎం:

రష్యా బృందంలో డజన్ల కొద్దీ రష్యన్ కంపెనీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 70 మందికి పైగా ప్రముఖ వ్యాపారవేత్తలు ఉన్నారని అలెక్సీ ఓవర్‌చుక్ తెలిపారు. వీరిలో రవాణా, లాజిస్టిక్స్, వ్యవసాయం మరియు ఫార్మాస్యూటికల్స్ రంగాలకు చెందిన కంపెనీలు ఉన్నాయని చెప్పారు.ఆఫ్ఘనిస్తాన్‌కు రష్యన్ ఎరువుల అవసరం ఎంతో ఉందని, నేరుగా ఆఫ్ఘనిస్తాన్‌లోనే ఎరువుల తయారీ ప్లాంట్లను నిర్మించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆయన వెల్లడించారు.

93% విజయంతో ఆగబోం.. సంపూర్ణ విజయమే లక్ష్యం!

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- 1979 నుంచే ఇరాన్ తమపై యుద్ధం చేస్తోందన్న అమెరికా అధ్యక్షుడు
- బీ-2 బాంబర్లతో ఇరాన్ అణ్వాయుధ తయారీని అడ్డుకున్నామని వెల్లడి; ఘర్షణలో 18 మంది అమెరికా సైనికులు మృతి
- ధ్వంసమైన సామర్థ్యాలను ఇరాన్ తిరిగి నిర్మించుకోవడానికి 25 ఏళ్లు పడుతుందని వ్యాఖ్య



బలగం టీవీ, అంతర్జాతీయ విభాగం:

ఇరాన్‌తో కొనసాగుతున్న పశ్చిమాసియా యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (Donald Trump) కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఘర్షణను అమెరికా ప్రారంభించలేదని, 1979 నుంచే ఇరాన్ తమ దేశంపై యుద్ధం చేస్తోందని ఆరోపించారు. అర్లింగ్టన్ నేషనల్ సెమెట్రీలో నిర్వహించిన 2026 జాతీయ వెటరన్స్ డే కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, వెటరన్స్ వ్యవహారాల శాఖ కార్యదర్శి డగ్ కొలిన్స్‌తో కలిసి పాల్గొన్న ట్రంప్, అమరవీరులైన సైనికులకు నివాళులర్పించిన అనంతరం ప్రసంగించారు.

సంపూర్ణ విజయమే లక్ష్యం – ట్రంప్:

అమెరికా సైనిక చర్యలతో ఇరాన్ సామర్థ్యాలు గణనీయంగా దెబ్బతిన్నాయని ట్రంప్ పేర్కొన్నారు. "మేము 93 శాతం విజయంతో ఆగిపోకూడదు, సంపూర్ణ విజయం సాధించడమే మా లక్ష్యం. అమెరికా దాడుల్లో ధ్వంసమైన వ్యవస్థలను తిరిగి నిర్మించుకోవడానికి ఇరాన్‌కు కనీసం 25 ఏళ్లు పడుతుంది. యుద్ధం త్వరలోనే ముగుస్తుందని, ఆ తర్వాత ఇరాన్‌ను పునర్నిర్మించాల్సిన అవసరం కూడా ఉంటుంది" అని ట్రంప్ స్పష్టం చేశారు.

బీ-2 బాంబర్లతో అణ్వాయుధ తయారీకి అడ్డుకట్ట:

ఏడు నెలల క్రితం ఇరాన్‌పై సైనిక కార్యకలాపాలు ప్రారంభించామని, బీ-2 బాంబర్లను ఉపయోగించి ఇరాన్ అణ్వాయుధాన్ని సంపాదించకుండా అడ్డుకున్నామని ట్రంప్ వెల్లడించారు. ఈ ఘర్షణల్లో 18 మంది అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు.

ఒప్పందం కుదరకపోతే దాడులకు సిద్ధం:

ఇటీవల ఖతార్ ప్రధాని షేక్ మహమ్మద్ బిన్ అబ్దుల్ రహ్మాన్ అల్ థానీతో చర్చలు జరిపినట్లు ట్రంప్ పేర్కొన్నారు. సైనికపరంగా యుద్ధం దాదాపు ముగిసినట్లేనని, ఇరాన్ అణు సామర్థ్యాలను శాశ్వతంగా అడ్డుకునే ఒప్పందం దిశగా సానుకూల వాతావరణం ఉందని చెప్పారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే దాడులు చేసేందుకు తమ సేనలు సర్వసన్నద్ధంగా ఉన్నాయని హెచ్చరించారు.

ఇరాన్ అణ్వాయుధాలను కలిగి ఉండకూడదనే విషయంలో ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ దేశాలు ఏకాభిప్రాయంతో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఇరాన్‌పై కొనసాగుతున్న నౌకాదళ దిగ్బంధనంతో పాటు 'ఆపరేషన్ ఐరన్ గేట్' పేరుతో చేపట్టిన భూ, సముద్ర దిగ్బంధనాన్ని కొనసాగించేందుకు గల్ఫ్ దేశాలు మొగ్గు చూపుతున్నాయని ట్రంప్ వివరించారు. ఇజ్రాయెల్ సహా పశ్చిమాసియా రక్షణకు అమెరికా కట్టుబడి ఉందని, ఈ సైనిక చర్యలు ముగిశాక ప్రపంచం మరింత సురక్షితంగా మారుతుందని హామీ ఇచ్చారు.

వాషింగ్టన్ డీసీలో కాల్పుల కలకలం

- వైట్ హౌస్‌కు సమీపంలో ఐదుగురిపై కాల్పులు; జిమ్‌లో ఒకరి మృతి, నిందితుడి ఆత్మహత్య!
- వైట్ హౌస్‌కు కేవలం ఒక మైలు దూరంలోని 'లోగాన్ సర్కిల్' ప్రాంతంలో గురువారం ఉదయం కాల్పులు
- జిమ్‌లో కాల్పులు జరిపి ఒకరిని హతమార్చిన దుండగుడు; అనంతరం అపార్ట్‌మెంట్‌లో తలదాచుకుని ఆత్మహత్య
- హోమ్ ఓనర్స్ అసోసియేషన్‌తో ఉన్న వివాదమే ఈ దారుణానికి కారణమని ప్రాథమిక అంచనా



బలగం టీవీ, అంతర్జాతీయ విభాగం:

అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో గురువారం (నవంబర్ 12) ఉదయం కాల్పుల ఘటన తీవ్ర కలకలం రేపింది. వైట్ హౌస్‌కు సమీపంలోని రద్దీ ప్రాంతమైన లోగాన్ సర్కిల్ (Logan Circle) లో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో ఐదుగురు వ్యక్తులు బుల్లెట్ గాయాలకు గురయ్యారు. వీరిలో జిమ్‌లో ఉన్న ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, పోలీసుల వలయంలో చిక్కుకున్న నిందితుడు సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

మెట్రోపాలిటన్ పోలీస్ డిపార్ట్‌మెంట్ తాత్కాలిక చీఫ్ జెఫ్రీ కారోల్ ఈ వివరాలను వెల్లడించారు. అపార్ట్‌మెంట్ బిల్డింగ్ 'హోమ్ ఓనర్స్ అసోసియేషన్'తో నిందితుడికి ఉన్న వివాదమే ఈ దారుణానికి దారితీసినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు.

జిమ్ లోపల, పార్కింగ్ గ్యారేజీలో కాల్పులు:

ఉదయం 8 గంటల సమయంలో సుమారు 50 మంది సభ్యులు ఉన్న 'పేడా (VIDA) ఫిట్‌నెస్ సెంటర్' లోకి ప్రవేశించిన దుండగుడు ఒక్కసారిగా కాల్పులు జరిపాడు. జిమ్‌లో ఉన్న ఓ వ్యక్తి మెడలో బుల్లెట్ తగలడంతో రక్తపు మడుగులో కుప్పకూలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడని ప్రత్యక్ష సాక్షి జేమ్స్ స్పెల్‌మాన్ తెలిపారు.జిమ్‌లో కాల్పుల అనంతరం బయటకు వచ్చిన నిందితుడు మరికొన్ని రౌండ్లు కాల్పులు జరిపాడు. సమీపంలోని పార్కింగ్ గ్యారేజీ ఎలివేటర్‌లో మరో వ్యక్తిపై కాల్పులు జరిపిన అనంతరం, ఓ అపార్ట్‌మెంట్ ఏడో అంతస్తులోకి వెళ్లి గది గడియ పెట్టుకున్నాడని పోలీసు వర్గాలు తెలిపాయి.

రంగంలోకి దిగిన స్వాట్ (SWAT) బృందాలు, ఎఫ్‌బీఐ: సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులతో పాటు స్వాట్ బృందాలు, ఎఫ్‌బీఐ (FBI), ఏటీఎఫ్ (ATF) ఏజెంట్లు ఘటనా స్థలానికి చేరుకుని 15వ వీధిని పూర్తిగా దిగ్బంధించారు. సమీపంలోని పాఠశాలలకు లాక్‌డౌన్ విధించారు. భవనం పైకప్పులపైకి చేరుకున్న భద్రతా దళాలు నిందితుడిని చుట్టుముట్టగా, అతను లోపలే తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

కాగా, గత ఏడాది ఆగస్టులో ఇదే లోగాన్ సర్కిల్ ప్రాంతంలో ఓ ప్రభుత్వ అధికారిపై దాడి జరిగిన నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నగరంలో నేరాల నియంత్రణకు నేషనల్ గార్డ్ దళాలను మోహరించారు. ఆ భద్రత కొనసాగుతున్నప్పటికీ తాజా కాల్పులు స్థానికులను భయాందోళనకు గురిచేశాయి.

పశ్చిమాసియాలో భగ్గుమంటున్న ఉద్రిక్తతలు

- గాజా ఆసుపత్రిపై ఇజ్రాయెల్ వైమానిక దాడి.. ఒక సర్జన్‌తో సహా ఆరుగురి మృతి!
- దక్షిణ గాజాలోని నాసర్ (Nasser) ఆసుపత్రి సర్జికల్ విభాగంపై బాంబు దాడి; 28 మందికి తీవ్ర గాయాలు



బలగం టీవీ, అంతర్జాతీయ విభాగం:

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మరింత దట్టమవుతున్నాయి. గురువారం (నవంబర్ 12) గాజా స్ట్రిప్‌లోని ప్రధాన ఆసుపత్రులలో ఒకటైన నాసర్ (Nasser) ఆసుపత్రిపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో ఒక సర్జన్, 13 ఏళ్ల బాలుడితో సహా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 28 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ దాడితో పాటు ఇరాన్ అణు విధానం, ఫ్రాన్స్‌లో ఇజ్రాయెల్ నాయకుడిపై నిషేధం వంటి పరిణామాలతో పశ్చిమాసియాలో ఉద్రిక్తత నెలకొంది.

1. నాసర్ ఆసుపత్రిపై ఇజ్రాయెల్ దాడి.. ఆగిన శస్త్రచికిత్సలు:

దక్షిణ గాజాలో ప్రస్తుతం పనిచేస్తున్న అతికొద్ది ఆసుపత్రులలో నాసర్ ఆసుపత్రి ఒకటి. గురువారం ఈ ఆసుపత్రిలోని సర్జికల్ విభాగంపై ఇజ్రాయెల్ క్షిపణి దాడి జరిపింది.

ఎలాంటి ముందస్తు హెచ్చరిక లేకుండానే దాడి జరిగిందని, భవనం దెబ్బతినడంతో శస్త్రచికిత్సలతో పాటు రేడియాలజీ, ల్యాబ్ సేవలను నిలిపివేశామని ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ అహ్మద్ అల్-ఫ్రా తెలిపారు.

హమాస్ కమాండర్, మిలిటెంట్లను లక్ష్యంగా చేసుకుని దాడి చేశామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించినప్పటికీ, మృతుల్లో ఆ కమాండర్ లేడని స్పష్టమైంది.

అనంతరం గాజాలో ఒక కారుపై ఇజ్రాయెల్ జరిపిన మరో దాడిలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారు. అక్టోబర్ 2025 కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత ఇజ్రాయెల్ దాడుల్లో 1,600 మందికి పైగా మరణించగా, ఇప్పటివరకు మొత్తం మృతుల సంఖ్య 74,600 దాటినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

2. అణు ఒప్పందం నుంచి వైదొలగాలని ఇరాన్ క్లరిక్స్ సూచన:

అమెరికా, ఇజ్రాయెల్ నుంచి వస్తున్న వరుస బెదిరింపుల నేపథ్యంలో, అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (NPT) నుంచి వైదొలగడం, తమ సైనిక సిద్ధాంతాన్ని పునఃసమీక్షించుకోవడం "అనివార్యమైన అవసరం" అని ఇరాన్ సుప్రీం లీడర్‌ను నియమించే 'అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్' గురువారం పేర్కొంది.

ఇప్పటివరకు ఇరాన్ తమ అణు కార్యక్రమం కేవలం శాంతియుత అవసరాల కోసమేనని చెబుతూ వచ్చింది.

అయితే ఇటీవలి పరిణామాల నేపథ్యంలో అణు విధానాన్ని మార్చుకోవాలనే డిమాండ్లు ఇరాన్ రాజకీయ వర్గాల్లో పెరుగుతున్నాయి. దీనిపై తుది నిర్ణయం జాతీయ భద్రతా మండలి సిఫార్సు మేరకు సుప్రీం లీడర్ తీసుకోనున్నారు.

3. ఇజ్రాయెల్ సెటిలర్ల నాయకుడికి ఫ్రాన్స్ చుక్కెదురు:

ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయెల్ నివాసాల (Settlements) విస్తరణలో కీలక పాత్ర పోషిస్తున్న ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పార్టీ (లికుడ్) నాయకుడు యోస్సీ దగన్ (Yossi Dagan) ను ఫ్రాన్స్ అధికారులు దేశంలోకి అనుమతించలేదు.

గత వారం పారిస్‌లోని చార్లెస్ డి గల్లె విమానాశ్రయానికి చేరుకున్న ఆయన్ను అక్కడి నుంచే వెనక్కి పంపించినట్లు బుధవారం అధికారికంగా వెల్లడైంది.

వెస్ట్ బ్యాంక్‌లో అక్రమ నివాసాల విధానాన్ని అమలు చేస్తున్నందుకే ఆయనపై నిషేధం విధించామని ఫ్రాన్స్ విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. కాగా, ఈ ఏడాది ప్రారంభంలో ఇజ్రాయెల్ మంత్రులు ఇటమార్ బెన్-గ్విర్, బెజలెల్ స్మోట్రిచ్‌లపై కూడా ఫ్రాన్స్ నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ఫ్రాన్స్ చర్యను ఇజ్రాయెల్ తీవ్రంగా ఖండించింది.

స్పెయిన్‌లో గృహ సంక్షోభ నివారణ చర్యలకు తాత్కాలిక ఆమోదం!

- దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె, భారీ వీధి నిరసనలు
- మరుసటి రోజే కీలక డిక్రీని 35-34 ఓట్ల తేడాతో ఆమోదించిన తాత్కాలిక దిగువ సభ
- 2030 వరకు బలహీన వర్గాల అద్దెదారులను ఖాళీ చేయించకుండా రక్షణ; రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్ట
- నవంబర్ 29న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వస్తే ఈ చట్టాలను రద్దు చేస్తామంటున్న ప్రతిపక్ష పాపులర్ పార్టీ (PP)

బలగం టీవీ, అంతర్జాతీయ విభాగం:

స్పెయిన్‌లో ఆకాశాన్ని తాకుతున్న ఇంటి అద్దెలు, నివాస గృహాల కొరతపై ప్రజలు చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె (General Strike) మరియు భారీ నిరసనల ధాటికి ప్రభుత్వం దిగివచ్చింది. బుధవారం దేశవ్యాప్తంగా లక్షలాది మంది రోడ్లపైకి వచ్చి ఆందోళనలు నిర్వహించిన మరుసటి రోజే, అంటే గురువారం (నవంబర్ 12) స్పెయిన్ పార్లమెంటు తాత్కాలిక దిగువ సభ (Permanent Deputation) గృహ సంక్షోభ నివారణ చర్యలకు ఆమోదం తెలిపింది.అయితే, ఈ చట్టాల మనుగడ ఈ నెల 29న జరగనున్న స్పెయిన్ సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై ఆధారపడి ఉండనుంది.

ఉత్కంఠభరితంగా ఓటింగ్ – 35-34 తేడాతో గట్టెక్కిన మొదటి డిక్రీ:

గత నెలలో మాడ్రిడ్‌లో 87 ఏళ్ల వృద్ధురాలిని ఇంటి నుంచి బలవంతంగా ఖాళీ చేయించడం, ఆ తర్వాత ఆమె మరణించడంతో స్పెయిన్‌లో ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంది. అప్పట్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులను ప్రతిపక్షాలు అడ్డుకోవడంతో ప్రధాని పెడ్రో శాంచెజ్ ముందస్తు ఎన్నికలకు పిలుపునిచ్చారు. తాజాగా పార్లమెంటు రద్దయిన నేపథ్యంలో, 69 మంది సభ్యులున్న తాత్కాలిక దిగువ సభలో ప్రభుత్వం ఈ చర్యలను రెండు వేర్వేరు డిక్రీలుగా విభజించి ప్రవేశపెట్టింది:

మొదటి డిక్రీ ఆమోదం: 35-34 ఓట్ల స్వల్ప ఆధిక్యంతో కీలక గృహ సంస్కరణల డిక్రీ ఆమోదం పొందింది.

రెండో డిక్రీ తిరస్కరణ: అద్దె ఒప్పందాలను ఆటోమేటిక్‌గా రెన్యూవల్ చేసే, ఒకవేళ యజమానులు ఒప్పందం రద్దు చేస్తే ఏడాది అద్దెను పరిహారంగా చెల్లించే నిబంధనలతో కూడిన రెండో డిక్రీ 34-35 ఓట్ల తేడాతో వీగిపోయింది.

ఆమోదం పొందిన ముఖ్య అంశాలు:

ఖాళీ చేయించకుండా రక్షణ: ఆర్థికంగా, సామాజికంగా బలహీన స్థితిలో ఉన్న అద్దెదారులకు ప్రత్యామ్నాయ నివాసం చూపే వరకు, వారిని ఇళ్ల నుంచి ఖాళీ చేయించకుండా 2030 వరకు రక్షణ కల్పించారు.

రియల్ ఎస్టేట్ దోపిడీకి అడ్డుకట్ట: తక్కువ ధరలకు ఇళ్లను కొనుగోలు చేసి, అధిక ధరలకు అమ్ముకునే రియల్ ఎస్టేట్ సంస్థల (Vulture funds) ఆగడాలను అరికట్టేందుకు, ఆస్తి విలువలో 70 శాతం కంటే తక్కువ ధరకు కొనుగోలు చేయకుండా నిషేధం విధించారు.

అద్దెల నియంత్రణ & పర్యాటక పన్ను: ప్రభుత్వ సూచీ కంటే ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అద్దెల పెంపును నిలిపివేశారు. అలాగే 'ఎయిర్‌బీఎన్‌బీ' (Airbnb) వంటి ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా పర్యాటకులకు అద్దెకు ఇచ్చే అపార్ట్‌మెంట్లపై 10 శాతం పన్ను విధించారు.

ఎన్నికల తర్వాత రద్దు చేస్తామంటున్న ప్రతిపక్షం:

నిన్న వీధుల్లో గెలిచిన నివాస హక్కు, నవంబర్ 29న బ్యాలెట

ఫైనల్‌లోకి దూసుకెళ్లిన భారత్!

- అండర్-19 ఆసియా కప్ 2026లో అఫ్గానిస్థాన్‌ను చిత్తు చేసి
- సెమీఫైనల్లో 8 వికెట్ల తేడాతో అఫ్గాన్ జట్టుపై ఘన విజయం సాధించిన యువ భారత్
- తృటిలో సెంచరీ కోల్పోయిన కెప్టెన్ లక్ష్య రాయ్‌చందాని (93); అర్ధశతకాలతో చెలరేగిన ఆర్యవీర్ సెహ్వాగ్, వీకే వినీత్
- శనివారం జరిగే తుది పోరులో దాయాదీ పాకిస్థాన్‌తో అమీతుమీ తేల్చుకోనున్న టీమిండియా



బలగం టీవీ, క్రీడా విభాగం:

అండర్-19 ఆసియా కప్ 2026 టోర్నమెంట్‌లో భారత యువ జట్టు అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన ఉత్కంఠభరితమైన రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన భారత్ 8 వికెట్ల తేడాతో అఫ్గానిస్థాన్‌ను చిత్తు చేసింది. లీగ్ దశలో పాకిస్థాన్ చేతిలో ఎదురైన ఓటమికి ప్రతీకారం తీర్చుకునేందుకు శనివారం జరిగే ఫైనల్లో భారత్ సిద్ధమవుతోంది.

అఫ్గాన్ పోరాటం విఫలం – ఇషాన్ సూద్ మెరుపు బౌలింగ్:

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 227 పరుగులు చేసింది. అఫ్గాన్ బ్యాటర్లలో నోమన్ సలార్జాయ్ (51), షా ఫైజల్ రహిమి (51) అర్ధశతకాలతో రాణించగా, సోహైల్ ఖాన్ (36 నాటౌట్) పర్వాలేనిపించాడు. భారత బౌలర్లలో ఇషాన్ సూద్ 3/43 అద్భుత ప్రదర్శన చేయగా, ఆర్యన్ సవ్సాని 2 వికెట్లు పడగొట్టాడు. కావ్య పరేష్, యశ్‌బర్ధన్, అర్జున్ రాజ్‌పుత్ తలో వికెట్ దక్కించుకున్నారు.

లక్ష్య, ఆర్యవీర్, వినీత్ వీరవిహారం:

అనంతరం 228 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ కేవలం 36.5 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 230 పరుగులు చేసి సులభంగా విజయం సాధించింది.

భారత ఇన్నింగ్స్‌లో ఓపెనర్లుగా బరిలోకి దిగిన కెప్టెన్ లక్ష్య రాయ్‌చందాని (90 బంతుల్లో 93; 13 ఫోర్లు, 1 సిక్స్) తృటిలో సెంచరీ కోల్పోయినా అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు.

మరో ఓపెనర్, వీరందరి దృష్టిని ఆకర్షిస్తున్న మాజీ దిగ్గజం కుమారుడు ఆర్యవీర్ సెహ్వాగ్ (57 బంతుల్లో 51; 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో) విధ్వంసకర అర్ధశతకం సాధించాడు. తొలి వికెట్‌కు లక్ష్య, ఆర్యవీర్ జోడీ అద్భుతమైన ఆరంభాన్నిచ్చి 117 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది.

ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన వీకే వినీత్ (62 బంతుల్లో 57 నాటౌట్) బాధ్యతాయుతంగా ఆడి జట్టును విజయతీరాలకు చేర్చాడు.

లీగ్ దశలో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ చేతిలో ఓటమిపాలైన భారత్, ఇప్పుడు అదే ప్రత్యర్థితో ఫైనల్లో తలపడనుండటంతో మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. లీగ్ ఓటమికి బదులు తీర్చుకుని ఛాంపియన్‌గా నిలవాలని భారత కుర్రాళ్లు పట్టుదలగా ఉన్నారు.



ఫైనల్లోకి పాకిస్థాన్ అండర్–19 జట్టు

- బంగ్లాదేశ్‌పై 9 వికెట్ల తేడాతో ఘన విజయం.. రిజ్వానుల్లాకు ఐదు వికెట్లు

బలగం టీవీ, క్రీడా విభాగం:

అండర్–19 ఆసియా కప్–2026 టోర్నీలో పాకిస్థాన్ ఫైనల్‌కు చేరింది. గురువారం బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి సెమీఫైనల్లో 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. పాక్ బౌలర్ రిజ్వానుల్లా (5/30) ఐదు వికెట్లతో ప్రత్యర్థి జట్టు పతనాన్ని శాసించాడు.

తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 31.4 ఓవర్లలో 138 పరుగులకు ఆలౌటైంది. అబ్దుల్లా ముహి (45 బంతుల్లో 50; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకంతో రాణించగా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. పాక్ బౌలర్లలో రిజ్వానుల్లా ఐదు వికెట్లు పడగొట్టగా, మహమ్మద్ సయ్యమ్ (2/29) రెండు వికెట్లు తీశాడు. అలీ రజా, హస్నైన్ అబ్బాస్ దార్, అహ్మద్ హుస్సేన్ తలో వికెట్ దక్కించుకున్నారు.

అనంతరం 139 పరుగుల లక్ష్యాన్ని పాకిస్థాన్ 21.5 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఉస్మాన్ ఖవాజా (54 బంతుల్లో 64 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), హయమ్ ఖాన్ (72 బంతుల్లో 69; 8 ఫోర్లు, ఒక సిక్స్) అర్ధశతకాలతో జట్టును గెలిపించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో రకిబుల్ హుస్సేన్ ఒక్కడే వికెట్ తీశాడు.

రెండో సెమీఫైనల్లో అఫ్గానిస్థాన్‌తో భారత్ తలపడుతోంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే ఫైనల్లో పాకిస్థాన్‌తో మరోసారి తలపడనుంది. లీగ్ దశలో ఇప్పటికే పాక్ చేతిలో ఓటమి పాలైన భారత్.. తుది పోరులో గెలిచి ప్రతీకారం తీర్చుకోవాలని భావిస్తోంది. ఫైనల్ మ్యాచ్ శనివారం జరగనుంది.

ఇ-స్పోర్ట్స్ వరల్డ్ కప్ 2027లోనూ చెస్

- మళ్లీ రియాద్ వేదికగా హ్యాట్రిక్ టైటిల్‌పై మాగ్నస్ కార్ల్‌సన్ కన్ను!

బలగం టీవీ, క్రీడా విభాగం:

ప్రపంచ క్రీడా రంగంలో వేగంగా విస్తరిస్తున్న 'ఇ-స్పోర్ట్స్ వరల్డ్ కప్' (Esports World Cup - EWC) 2027 ఎడిషన్‌లోనూ చెస్ (Chess) కొనసాగనుంది. వరుసగా మూడో ఏడాది ఈ ప్రతిష్టాత్మక టోర్నీ జాబితాలో చెస్‌కు చోటు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం (నవంబర్ 12) అధికారికంగా ప్రకటించారు. అమెరికా-ఇరాన్ యుద్ధం, పశ్చిమాసియాలో నెలకొన్న అస్థిరత కారణంగా భద్రతా దృష్ట్యా ఈ ఏడాది (2026) టోర్నీని ఫ్రాన్స్ రాజధాని పారిస్‌కు తరలించగా, 2027లో జరగనున్న నాలుగో ఎడిషన్ మళ్లీ సౌదీ అరేబియా రాజధాని రియాద్ వేదికగా జరగనుంది.

హ్యాట్రిక్ టైటిల్ వేటలో మాగ్నస్ కార్ల్‌సన్:

ఇప్పటివరకు జరిగిన రెండు ఎడిషన్లలోనూ (2025, 2026) విజేతగా నిలిచిన నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్ (Magnus Carlsen), 2027లో హ్యాట్రిక్ టైటిల్‌పై కన్నేశారు.

పారిస్‌లో జరిగిన 2026 ఫైనల్లో 'టీమ్ లిక్విడ్' తరపున ఆడిన కార్ల్‌సన్, 19 ఏళ్ల యువ సంచలనం డెనిస్ లాజావిక్‌ను 2-0 సెట్ల



తేడాతో ఒక్క గేమ్ కూడా కోల్పోకుండా చిత్తు చేసి టైటిల్ నిలబెట్టుకున్నారు.

2027 EWC కోసం అర్హత సాధించే ఆటగాళ్లను ఎంపిక చేసేందుకు Chess.com సంస్థ మరోసారి ఇ-స్పోర్ట్స్ ఫౌండేషన్‌తో చేతులు కలిపింది. ఇందుకోసం అప్‌గ్రేడ్ చేసిన 'ఛాంపియన్స్ చెస్ టూర్ 2026-2027' సైకిల్‌ను నిర్వహించనున్నారు.

ఇ-స్పోర్ట్స్ చెస్‌లో పెరుగుతున్న భారత్ హవా:

2026 ఇ-స్పోర్ట్స్ వరల్డ్ కప్‌లో భారత్ తన చరిత్రలోనే అతిపెద్ద చెస్ బృందాన్ని బరిలోకి దించింది. మొత్తం నలుగురు భారత గ్రాండ్ మాస్టర్లు ఈ టోర్నీలో తలపడ్డారు:

భారత ఇ-స్పోర్ట్స్ సంస్థ S8UL Esports తరపున నిహాల్ సరీన్, అరవింద్ చిదంబరం, ప్రణేష్ ఎం ప్రాతినిధ్యం వహించారు.

Gen.G Esports తరపున అర్జున్ ఎరిగైసి పోటీపడ్డాడు.

వీరిలో నిహాల్ సరీన్, అర్జున్ ఎరిగైసి ఇద్దరూ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుని అంతర్జాతీయ వేదికపై భారత్ సత్తా చాటారు.

ఆటగాళ్లతో పాటు భారత ఇ-స్పోర్ట్స్ సంస్థల ప్రాతినిధ్యం కూడా గణనీయంగా పెరిగింది. S8UL Esportsతో పాటు మరో ప్రముఖ భారత సంస్థ GodLike Esports కూడా EWC క్లబ్ పార్ట్‌నర్‌గా ఎంపికైంది. 2026 చెస్ ఈవెంట్‌లో గాడ్‌లైక్ తరపున హాన్స్ మోక్ నీమాన్ పోటీపడ్డాడు. 2027 టోర్నీలో భారత ఆటగాళ్లు మరింత మెరుగైన ప్రదర్శన చేస్తారని క్రీడా వర్గాలు ఆశిస్తున్నాయి.



ఫైనల్లో పాకిస్థాన్‌ను ఓడించి టైటిల్ గెలుస్తాం

- కెప్టెన్ లక్ష్య రాజేష్ రాయ్‌చందాని ధీమా!
- సెంచరీ తృటిలో కోల్పోయినా జట్టు విజయమే ముఖ్యమని, బౌలర్ల అద్భుత ప్రదర్శనే గెలుపునకు బాటలు వేసిందని వెల్లడి

బలగం టీవీ, క్రీడా విభాగం:

అండర్-19 ఆసియా కప్ 2026 టోర్నమెంట్‌లో భాగంగా గురువారం జరిగిన రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్‌ను చిత్తు చేసి ఫైనల్‌లోకి దూసుకెళ్లిన అనంతరం భారత యువ జట్టు కెప్టెన్ లక్ష్య రాజేష్ రాయ్‌చందాని మీడియాతో మాట్లాడారు. శనివారం జరగనున్న తుది పోరులో దాయాదీ పాకిస్థాన్‌తో అమీతుమీ తేల్చుకోనుండగా, ఈ మహా సమరంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

సెంచరీ కంటే జట్టు విజయమే ముఖ్యం:

సెమీఫైనల్ పోరులో తృటిలో సెంచరీ చేజార్చుకోవడంపై లక్ష్య స్పందిస్తూ.. వ్యక్తిగత మైలురాయి కంటే జట్టు గెలవడమే తనకు అత్యంత సంతోషాన్నిచ్చిందని తెలిపాడు. "సెంచరీ మిస్సయినందుకు కొద్దిగా నిరాశ ఉన్నా, జట్టు గెలిచినందుకు చాలా ఆనందంగా ఉంది. నేను కేవలం స్వేచ్ఛగా బ్యాటింగ్ చేయడానికి, పరిస్థితికి తగినట్లుగా ఆడేందుకు ప్రయత్నించాను. ఆ వ్యూహం బాగా పనిచేసింది" అని పేర్కొన్నాడు.

బౌలర్ల అద్భుత ప్రదర్శనే శ్రీరామరక్ష:

మ్యాచ్‌లో బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి అఫ్గానిస్థాన్‌ను తక్కువ స్కోరుకే కట్టడి చేశారని లక్ష్య ప్రశంసించారు. "మరోసారి టాస్ ఓడిపోవడం మాకు కలిసొచ్చిందనే అనుకుంటున్నా. మా బౌలర్లు మిడిల్ ఓవర్లలో నిజంగా అద్భుతంగా రాణించారు. ఆటలో పైచేయి సాధించాలంటే సుదీర్ఘ సమయం పాటు నిలకడను కొనసాగించడం ముఖ్యం. ఈ మ్యాచ్‌లో అదే చేసి చూపించాం" అని వివరించాడు.

ఫైనల్‌లో పాక్‌తో రసవత్తర పోరు:

లీగ్ దశలో పాకిస్థాన్ చేతిలో ఎదురైన ఓటమికి ఫైనల్లో ప్రతీకారం తీర్చుకుంటామని లక్ష్య ధీమా వ్యక్తం చేశారు. "శనివారం జరిగే ఫైనల్ మ్యాచ్ చాలా రసవత్తరంగా ఉండబోతుంది. ఈ హై-వోల్టేజ్ మ్యాచ్ కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఫైనల్లోనూ మా ఉత్తమ ప్రదర్శన కనబర్చి, పాకిస్థాన్‌ను ఓడించి టైటిల్ గెలుచుకునేందుకు శాయశక్తుల ప్రయత్నిస్తాం" అని పేర్కొన్నాడు.

భారత అంధుల క్రికెట్ జట్టుకు బీసీసీఐ చేయూత!

- ఢాకా వేదికగా నవంబర్ 15 నుంచి 20 వరకు జరగనున్న ఆసియా కప్; 17 మందితో కూడిన భారత జట్టుకు దుర్గా రావు టొంపాకి నేతృత్వం
- న్యూఢిల్లీ నుంచి ఢాకా వరకు భారత జట్టుకు రౌండ్-ట్రిప్ విమాన ప్రయాణ ఖర్చులను భరించిన బీసీసీఐ (BCCI)
- నవంబర్ 15న శ్రీలంకతో తొలి మ్యాచ్ ఆడనున్న భారత్; నవంబర్ 17న దాయాదీ పాకిస్థాన్‌తో అమీతుమీ



బలగం టీవీ, క్రీడా విభాగం:

బంగ్లాదేశ్ రాజధాని ఢాకా వేదికగా నవంబర్ 15 నుంచి 20 వరకు జరగనున్న ఇంటర్నేషనల్ బ్లైండ్ క్రికెట్ ఆసియా కప్‌లో పాల్గొనేందుకు వెళ్తున్న భారత నేత్రహీనుల (Visually Challenged) క్రికెట్ జట్టుకు ఘనంగా వీడ్కోలు పలికారు. గురువారం న్యూఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో దుర్గా రావు టొంపాకి (Durga Rao Tompaki) నాయకత్వంలోని 17 మంది సభ్యుల జట్టును అట్టహాసంగా సాగనంపారు.

ఈ టోర్నమెంట్ కోసం భారత జట్టుకు అండగా నిలిచిన బీసీసీఐ (BCCI).. న్యూఢిల్లీ నుంచి ఢాకా వెళ్లేందుకు మరియు తిరిగి వచ్చేందుకు అయ్యే విమాన ప్రయాణ ఖర్చులను (Round-trip air tickets) పూర్తిగా స్పాన్సర్ చేసింది. "క్రికెట్ అనేది అందరికీ సమాన అవకాశాలను కల్పించాలి. ఈ అథ్లెట్లు దేశానికి గర్వకారణం" అని బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా పేర్కొంటూ జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు.

భారత టోర్నీ షెడ్యూల్ వివరాలు:

నవంబర్ 15: శ్రీలంకతో తొలి మ్యాచ్ (ప్రారంభ పోరు)

నవంబర్ 17: దాయాదీ దేశం పాకిస్థాన్‌తో మ్యాచ్

నవంబర్ 19: ఆతిథ్య బంగ్లాదేశ్‌తో మ్యాచ్

నవంబర్ 20: ఫైనల్ మ్యాచ్

దశాబ్దం క్రితం బైటిల్ గెలుచుకున్న భారత జట్టు, ఈసారి ఎలాగైనా ఆసియా కప్ ట్రోఫీని కైవసం చేసుకోవాలని పట్టుదలగా ఉంది.

సీఏబీఐ, సీబీఆర్ఈ (CBRE) సహకారం:

క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఇండియా (CABI), సమర్థనం ట్రస్ట్ (Samarthanam Trust) సంయుక్తంగా ఈ వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. దీనికి కార్పొరేట్ భాగస్వామి CBRE తమ సీఎస్ఆర్ (CSR) చొరవ 'ఏక్ పెహల్' (Ek Pehal) ద్వారా జట్టుకు పూర్తి మద్దతు ఇస్తోంది. ఆటగాళ్ల ఎంపిక, ప్రొఫెషనల్ కోచింగ్, పోషకాహారం, ఫిట్‌నెస్, ఫిజియోథెరపీ, ప్రయాణ ఏర్పాట్లు మరియు కిట్ల అందజేతను సీబీఆర్ఈ పర్యవేక్షిస్తోందని సంస్థ ఛైర్మన్ అన్షుమాన్ మాగజైన్ తెలిపారు. గుజరాత్, దిల్లీ, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, హరియాణా, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లు ఈ జట్టులో ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

ఆసియా కప్ భారత జట్టు సభ్యులు:

దుర్గా రావు టొంపాకి (కెప్టెన్), సునీల్ రమేశ్ (వైస్ కెప్టెన్), నరేశ్ తుడ్డూ, సంజయ్ కుమార్ షా, దేబరాజ్ బెహెరా, అశోక్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ శర్మ, ముకేశ్ కుమార్ రావత్, దున్న వెంకటేశ్వరరావు, రాంబీర్ సింగ్, లోకేశ్, మనీశ్ కుమార్, నకుల బడనాయక్, సుక్రామ్ మాఝి, ఎ. రవి (వికెట్ కీపర్), దినేశ్ రథ్వా, దీపక్.

న్యూజిలాండ్ చేతిలో భారత్‌కు భారీ ఓటమి..

- 0-5 గోల్స్‌తో చిత్తు!
- ఆక్లాండ్ వేదికగా జరిగిన తొలి అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్‌లో ఘోర పరాజయం చవిచూసిన భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు
- జెఫ్ రాండల్ (రెండు గోల్స్), క్రిస్ వుడ్, లాచ్లాన్ బేలిస్ విజృంభణ; బిజాయ్ వర్గీస్ సెల్ఫ్ గోల్‌తో ఖాతా తెరిచిన కివీస్
- పెనాల్టీ కిక్‌ను అడ్డుకోవడంతో పాటు అద్భుత సేవ్స్‌తో భారత్ మరింత భారీ ఓటమి నుంచి కాపాడిన గోల్‌కీపర్ విశాల్ కైత్

బలగం టీవీ, క్రీడా విభాగం:



నవంబర్ ఫిఫా విండోలో భాగంగా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్‌లో భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు ఘోర పరాజయాన్ని చవిచూసింది. గురువారం ఆక్లాండ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో ఆతిథ్య న్యూజిలాండ్ జట్టు 5-0 గోల్స్ తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. భారత ఫుట్‌బాల్ చరిత్రలో న్యూజిలాండ్ గడ్డపై 'బ్లూ టైగర్స్' ఆడిన తొలి మ్యాచ్ ఇదే కావడం గమనార్హం. ఇరు జట్ల మధ్య రెండో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆదివారం క్రైస్ట్‌చర్చ్‌లో జరగనుంది.

ఆరంభం నుంచే కివీస్ జోరు:

మ్యాచ్ ప్రారంభమైన ఐదో నిమిషంలోనే భారత డిఫెండర్ బిజాయ్ వర్గీస్ చేసిన సెల్ఫ్ గోల్‌తో న్యూజిలాండ్ ఖాతా తెరిచింది. ఆ తర్వాత కివీస్ ఆటగాడు జెఫ్ రాండల్ (34వ, 43వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేసి ఆధిక్యాన్ని పెంచగా, క్రిస్ వుడ్ (57వ నిమిషం), లాచ్లాన్ బేలిస్ (74వ నిమిషం) చెరో గోల్ సాధించి విజయాన్ని ఖాయం చేశారు.

విశాల్ కైత్ అద్భుత సేవ్స్:

మ్యాచ్‌లో న్యూజిలాండ్ దూకుడుకు భారత్ మూల్యం చెల్లించుకున్నప్పటికీ, గోల్‌కీపర్ విశాల్ కైత్ చేసిన అద్భుతమైన సేవ్స్ జట్టును మరింత భారీ ఓటమి నుంచి రక్షించాయి.

మ్యాచ్ అంతటా అటాకింగ్ ఆడిన కివీస్ ఆటగాళ్ల షాట్లను కైత్ పలుమార్లు విజయవంతంగా అడ్డుకున్నాడు.

ముఖ్యంగా 78వ నిమిషంలో కివీస్ ఆటగాడు బిల్ తుయిలోమా సంధించిన పెనాల్టీ కిక్‌ను కైత్ ఫుల్-స్ట్రెచ్ డైవ్ చేసి అడ్డుకోవడంతో పాటు, రీబౌండ్ అయిన బంతిని కూడా మళ్లీ పట్టుకుని అదరగొట్టాడు.

కోచ్ ఖాలిద్ జమిల్ ప్రయోగాలు:

2018 తర్వాత తొలిసారిగా భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన అనిరుధ్ థాపా మధ్యతరగతిలో జట్టును నడిపించే ప్రయత్నం చేశాడు. 19వ నిమిషంలో రయాన్ విలియమ్స్, మన్వీర్ సింగ్ కలిసి చేసిన ప్రయత్నం గోల్ రూపం దాల్చకపోవడం భారత్‌కు నిరాశ మిగిల్చింది.

మ్యాచ్‌ను గాడిలో పెట్టేందుకు కోచ్ ఖాలిద్ జమిల్ ద్వితీయార్ధంలో ఐదు మార్పులు చేశాడు. ఈ క్రమంలో రికీ మీటీ హాబామ్, ముహమ్మద్ సుహైల్ అంతర్జాతీయ అరంగేట్రం చేశారు. మ్యాచ్ ముగిసే సమయానికి దేవిద్ లాల్‌లాన్సంగా, టొంబా సింగ్ హాబామ్‌లకు కూడా కోచ్ అరంగేట్రం అవకాశం కల్పించాడు. ఆదివారం జరిగే రెండో మ్యాచ్‌లో పుంజుకుని మెరుగైన ప్రదర్శన చేయాలని భారత్ భావిస్తోంది.

శ్రీలంక క్రికెట్ కొత్త రాజ్యాంగ బిల్లుకు సుప్రీంకోర్టు ఆమోదం!

బలగం టీవీ, క్రీడా విభాగం:

శ్రీలంక క్రికెట్ (SLC) బోర్డులో సమూల ప్రక్షాళనకు ఉద్దేశించిన నూతన రాజ్యాంగ బిల్లుకు సుప్రీంకోర్టు ఆమోదముద్ర పడింది. శ్రీలంక క్రికెట్ బిల్లు పేరుతో రూపొందించిన ఈ డ్రాఫ్ట్ బిల్లుకు సంబంధించి పార్లమెంటులో స్పీకర్ జగత్ విక్రమరత్న బుధవారం వివరాలు వెల్లడించారు. 225 సభ్యులున్న పార్లమెంటులో ఈ బిల్లులోని రెండు క్లాజులకు ప్రత్యేక మెజారిటీ అవసరమని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని, అయితే కోర్టు సూచనల మేరకు వాటిని సవరిస్తే సాధారణ మెజారిటీతో కూడా ఆమోదించుకోవచ్చని ఆయన తెలిపారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎన్‌పీపీ (NPP) ప్రభుత్వానికి పార్లమెంటులో 159 స్థానాల పూర్తి మెజారిటీ ఉంది.

33 పిటిషన్లను పరిశీలించిన కోర్టు:

ఈ కొత్త రాజ్యాంగ బిల్లు రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఏకంగా 33 పిటిషన్లు దాఖలయ్యాయి. సాధారణంగా ఏదైనా బిల్లు గెజిట్ అయిన 14 రోజుల్లోపు కోర్టును ఆశ్రయించడానికి చట్టంలో అవకాశం ఉంది. పార్లమెంటరీ పార్టీ నేతలు, బిజినెస్ కమిటీతో చర్చించిన తర్వాత ప్రభుత్వం త్వరలోనే ఈ బిల్లుపై ఓటింగ్ తేదీని నిర్ణయించనుంది.

కొత్త రాజ్యాంగం అవసరం ఎందుకంటే..?

గత ఏడాది ఏప్రిల్ చివరిలో అప్పటి శ్రీలంక క్రికెట్ ఎన్నికైన బోర్డు పదవీకాలం ముగియకుండానే రాజీనామా చేయడంతో, ప్రస్తుతం రాజకీయంగా నియమించబడిన తాత్కాలిక కమిటీయే (Interim Committee) పాలనను చూస్తోంది. క్రికెట్ బోర్డులో వేళ్లూనుకున్న అవినీతిని రూపుమాపడానికి, అంతర్జాతీయ క్రికెట్‌లో శ్రీలంక దిగజారిన స్థానాన్ని తిరిగి మెరుగుపరచడానికి ఈ పరిపాలనా సంస్కరణలు ఎంతో కీలకమని ప్రస్తుత తాత్కాలిక కమిటీ స్పష్టం చేస్తోంది.

ఐఓఏ అధ్యక్ష రేసులో పీటీ ఉష కొనసాగింపు

బలగం టీవీ, క్రీడా విభాగం:

భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉష తిరిగి ఎన్నికయ్యే అవకాశాలను సజీవంగా ఉంచుకున్నారు. ఇటీవల స్పోర్ట్స్ పర్సన్స్ ఆఫ్ మెరిట్ (ఎస్ఓఎం) ఎన్నికల్లో ఓటమి పాలైన ఆమెకు ఐస్ హాకీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐహెచ్ఏఐ) జనరల్ బాడీకి మహిళా ప్రతినిధిగా నామినేట్ చేసింది. ఆ సమాఖ్య కార్యదర్శి హర్జిందర్ సింగ్ పురుష ప్రతినిధిగా ఎంపికయ్యారు.

ఐఓఏ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన 30 జాతీయ క్రీడా సమాఖ్యలు (ఎన్ఎస్ఎఫ్‌లు) తమ తరఫున ఒక్కో పురుష, మహిళా ప్రతినిధిని గురువారం మధ్యాహ్నం 3 గంటల్లోగా నామినేట్ చేయాలని ఎన్నికల అధికారి సంజరు కుమార్ శ్రీవాస్తవ సూచించారు. అయితే నామినేట్ అయిన వ్యక్తి సంబంధిత సమాఖ్య సభ్యుడై ఉండాలనే నిబంధన ఉంది. ట్రాక్ అండ్ ఫీల్డ్ దిగ్గజం పీటీ ఉష ఈ అర్హతను కలిగి ఉన్నారా? అనే అంశంపై స్పష్టత లేదు. నామినీ భారత పౌరుడై, 70 ఏళ్లలోపు వయసు కలిగి ఉండటంతోపాటు ఒలింపిక్ సూత్రాలపై అవగాహన, విశ్వాసం కలిగి ఉండాలని నిబంధనల్లో పేర్కొన్నారు.

ప్రొవిజనల్ ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను శుక్రవారం స్వీకరిస్తారు. శనివారం వాటిని పరిశీలించి, పరిష్కరించిన అనంతరం ఆదివారం తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారు. ఎన్ఎస్ఎఫ్‌ల నుంచి 60 మంది, ఇప్పటికే ఎన్నికైన ఎనిమిది మంది ఎస్ఓఎంలు, అథ్లెట్ల కమిషన్ నుంచి ఎంపికైన ఇద్దరు ప్రతినిధులు, భారత్‌లోని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) సభ్యుడు కలిపి మొత్తం 71 మందితో ఓటర్ల బృందం ఏర్పడనుంది. డిసెంబర్ 5న జరిగే ఐఓఏ కార్యనిర్వాహక మండలి ఎన్నికల్లో వీరు ఓటు వేయనున్నారు. ఎస్ఓఎంలతోపాటు ఎన్ఎస్ఎఫ్‌లు నామినేట్ చేసిన 60 మంది కూడా కార్యనిర్వాహక మండలి పదవులకు పోటీ చేయవచ్చు.